ప్రజాశక్తి
ఆదివారం 18 మే 2025 8 పేజీలు
ప్రకాశం బాపట్ల







ప్రతిజ్ఞ చేస్తున్న మంత్రి పార్థసారధి, కలెక్టర్ వెంకటమురళి

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారధి
- వేమూరులో 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర'



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి స్వామి

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మంత్రి స్వామి

దారి తప్పుతున్న రెవెన్యూశాఖ

- ప్రతి పనికీ పక్కా వసూళ్లు చేస్తున్న వైనం
- భూవ్యవహారాల్లో భారీగానే ముడుపులు డిమాండ్
- ప్రజాప్రతినిధుల్లోనూ రెవెన్యూ తీరుపై ఆందోళన
- ఇద్దరు ఉన్నతాధికారుల పనితీరుపైనా తీవ్ర అసంతృప్తి
- కలెక్టర్ అన్సారియా ప్రక్షాళన చేపట్టినా దారికి రాని పరిస్థితి



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

- జిల్లా కేంద్రంలో ఓ డివిజనల్ స్థాయి అధికారి ఓ భూమికి సంబంధించి కన్వర్షన్ కోసం రూ.10 లక్షలు డిమాండ్ చేసి.. చివరికి రూ.6 లక్షలు తీసుకొని ఫైల్‌పై సంతకం చేశారని పాలకపక్షంలో వినికిడి..

- యర్రగొండపాలెంలో నిబంధనలకు విరుద్ధంగా ఓ ప్రైవేటు భూమిపై ఏ సంబంధం లేని వ్యక్తికి హక్కు వచ్చేలా ఎన్‌ఓసీ ఇచ్చిన ఘటనలో తహశీల్దార్, సర్వేయర్, విఆర్‌ఓలపై కలెక్టర్ వేటు వేశారు.

- కనిగిరి తహశీల్దార్ పాసుపుస్తకం కోసం ముడుపులు అడుగుతున్నారని రైతులు నేరుగా పునుగోడులో జరిగిన రెవెన్యూ సదస్సులోనే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఆయనతో పాటు దిగువ సిబ్బందిపైనా వేటు పడింది. ఈ ఉదంతంలో ఆర్డీవో పాత్రపైనా అనేక ఆరోపణలు వచ్చాయి. ఆయన సమర్ధత ఇక్కడ ప్రశ్నార్థకంగా మారింది. ఆయనపైనా కలెక్టర్ చర్యకు ఉపక్రమించి.. మళ్లీ పాలనాపరమైన ఇబ్బందులు వస్తాయని వెనక్కు తగ్గారు. ఇక్కడ అసైన్‌భూముల్లో వెంచర్లు భారీగా వేసి అమాయకలకు అమ్మేశారు. వాటిల్లోనూ రెవెన్యూ పాత్ర ఉంది.

- మార్కాపురం ప్రాంతంలో గత ప్రభుత్వ హయంలో అడ్డగోలు అక్రమాలు జరిగాయి .రిజిస్ట్రార్లు ముగ్గురు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఒంగోలులో భూ కుంభకోణాలు అలాగే ఉన్నాయి. వాటిపై విచారణ నిలిచిపోయింది.

- అర్ధవీడు మండలంలో ఎప్పుడో పేద ముస్లిములకు ఇచ్చిన అసైన్ భూములను వారికే తెలియకుండా హైదరాబాద్‌కు చెందిన ఓ కంపెనీ బినామీ పేర్లుతో రిజిస్ట్రేషన్ చేయించుకుంది. ఇందుకు రెవెన్యూ అధికారులు పెద్దమొత్తంలో ముడుపులు తీసుకొని కంపెనీకి సహకరించారు. అసలు అసైన్ భూమి రిజిస్టర్ ఎలా చేశారు? ఎవరు బాధ్యులు అన్నదానిపై ఇంత వరకూ చర్యలు కనిపించలేదు.

ఈ సంఘటనలు చర్చ కోసం కొన్ని మాత్రమే. జిల్లాలో రెవెన్యూశాఖ దాదాపుగా గాడి తప్పింది. ముడుపులు లేకుండా ఏ పనులూ కావడం లేదు. ప్రజాప్రతినిధులు కూడా కొందరు రెవెన్యూ అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తిగానే ఉన్నారు. విధి లేని పరిస్థితిలో కొందరిని కొనసాగిస్తున్నారు. ఇద్దరు ఉన్నతాధికారులపై మంత్రితో పాటు ఎమ్మెల్యేలూ సంతృప్తిగా ▶ 2లో

దారి తప్పుతున్న రెవెన్యూ శాఖ

(మొదటిపేజీ తరువాయి)

కనిపించడం లేదు. వారిని వచ్చే బదిలీల్లో సాగనంపేందుకే సిద్ధంగా ఉన్నారు. కార్యాలయాల్లో ఫైళ్లు కదలడం లేదు. ముడుపులు నేరుగా డిమాండ్ చేస్తున్నారు. అంతా ఓకే అంటేనే సంతకం పెడుతున్నారు. ప్రతి పనికీ ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. పాలకపక్ష నేతలు రేషన్, ఇసుక, గ్రావెల్, గ్రానైట్ దందాలు చేస్తుంటే రెవెన్యూ అధికారులు తమ వద్దకు వచ్చే భూముల ఫైళ్లకు రేట్లు పెట్టి.. మరీ వసూలు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని డివిజనల్ స్థాయి రెవెన్యూ అధికారి వసూళ్లు బాగా చేస్తున్నారనే ప్రచారం సాగుతోంది. డబ్బులు లేకుండా ఏ పనీ చేయడం లేదనే చర్చ ప్రజాప్రతినిధుల్లోనే ఉంది. తహశీల్దార్లకు ఏ ఫైలుకు ఎంత ఇవ్వాలనే దానిపై గట్టిగానే చెబుతారనే చర్చ ఉంది. జిల్లాకేంద్రంలోని మరో ఉన్నతాధికారి పనితీరుపైనా నేతల్లో అసంతృప్తి ఉంది. ఈయనపైనా అవినీతి ఆరోపణలున్నాయి. చాలాకాలంగా ఈ చర్చ ఉన్నప్పటికీ ఈయన్ను బదిలీచేసే వరకూ ఆగాల్సి ఉంది. ఉత్తరాంధ్ర జిల్లాల్లో కీలక జిల్లాలో పోస్టింగు కోసం ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. పశ్చిమ ప్రాంతంలోని మరో కీలక రెవెన్యూ అధికారి కూడా ఏది చెప్పినా పెడచెవిన పెడుతున్నారనే విమర్శలున్నాయి. ఆయన్ను కూడా పంపించి ఆర్డీవో స్థాయి అధికారిని తెచ్చుకోవాలనే ఆలోచన చేస్తున్నారు. కనిగిరి ఆర్డీవోదీ ఇదే పరిస్థితి. ప్రస్తుతం ఆయన సెలవులో ఉన్నారు. మండలాల్లో తహశీల్దార్లు పాసుపుస్తకాల కోసం ఎవరు వెళ్లినా చెప్పేదేమీ లేదు. ఏసీబీ అధికారులు యాక్టివ్‌గా ఉంటే రోజూ దొరికిపోతారనడంలో సందేహం లేదు. ప్రస్తుతం రీసర్వే సాగుతోంది. భూముల విస్తీర్ణాల్లో తేడాలు వస్తున్నాయి. ఆన్‌లైన్ సమస్యలూ తెరపైకి వస్తున్నాయి. వాటిని సరిచేయాలంటే ముడుపులు అడుగుతున్నారనే ఆరోపణలున్నాయి. ఇక ఆన్‌లైన్‌లో భూములను ఎక్కించాలని ఎవరైనా వస్తే రెవెన్యూ అధికారుల పంట పండుతోంది. భూ యజమానులు చనిపోయాక వారి కుమారులు, హక్కుదారులు, ఇతర కుటుంబసభ్యులు తమ పేర్లపైకి భూమిని మార్చుకోవాలంటే నెలలు తిరుగుతున్నారు. పదుల సంఖ్యలో పత్రాలు కావాలంటారు. ఇవన్నీ తెచ్చుకోవాలంటే పనులు మానుకుని కార్యాలయాల చుట్టూ తిరగాలి. ఈ పని సులువుగా జరగాలంటే ముడుపులు ఇస్తే చాలు. ఎవరి భూమిని ఎవరి పేరుతోనైనా ఎక్కిస్తారు. ఎవరికైనా ఎన్‌ఓసీలు ఇస్తారు. వైపాలెంలో ఇదే జరిగింది. ఇప్పుడు తహశీల్దార్ కార్యాలయాల్లో ముడుపులు లేకుండా పనులు జరగడం లేదు. ఇది గతం కన్నా పెరిగిందని పాలకపక్షంలోనే చర్చ సాగుతోంది. ఇక పాలనలో తనదైన శైలిలో ఉన్న కలెక్టర్ అన్సారియా రెవెన్యూ శాఖను ప్రక్షాళన చేయాలనే ప్రయత్నంలో ఉన్నారు. ఇప్పటికే తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకున్నారు. చర్యలు ఎంత మేరకు అనేదే ప్రశ్న. అధికారుల ఆలోచనల్లో మార్పు రావాలి. కష్టాల్లో ఉన్న వారికి సేవ చేయాలనే ఆలోచన పెరగాలి. అర్జీతో వచ్చిన బాధితుడికి అండగా నిలవాలి.



చింతగుంట్లలో చలివేంద్రం ప్రారంభిస్తున్న నాయకులు

చింతగుంట్లలో చలివేంద్రం ప్రారంభం

ప్రజాశక్తి-మార్కాపురం


మార్కాపురం మండలం చింతగుంట్లలో చలివేంద్రాన్ని టిడిపి నేతలు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీ రామ్‌రెడ్డి మాట్లాడుతూ వేసవిలో ప్రజల దాహార్తి తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అబ్రహాం తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో నాణ్యతకే ప్రాధాన్యం

పనుల్లో లోపాలుంటే చట్టపరమైన చర్యలు: ఏపీడీ నిర్మలాదేవి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలులో నిర్లక్ష్యానికి తావుండదని, అన్ని పనులు నిర్దేశిత గడువులోపు నాణ్యతతో పూర్తయ్యేలా చూడాలని మార్కాపురం క్లస్టర్ అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ నిర్మలాదేవి ఉపాధి సిబ్బందిని గట్టిగా హెచ్చరించారు. శనివారం యర్రగొండపాలెం పట్టణంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని ప్రతి గ్రామంలో కూడా ఇచ్చిన టార్గెట్‌లను పక్కా ప్రణాళికతో, ఖచ్చితమైన కొలతలతో పూర్తి చేయాలన్నారు. ఫారం పాండ్లు, నీటి కాలువలు, కాంటూరు కందకాలు లాంటి పనుల్ని నాణ్యతకు లోపం లేకుండా పూర్తి చేయాలని చెప్పారు. ప్రభుత్వం తెలిపిన నిబంధనల మేరకే కూలీల వేతనాలు చెల్లించాలని స్పష్టం చేశారు. అలాగే పనుల్లో ఏవైనా లోపాలు, తేడాలు ఉంటే తగిన చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. కూలీలకు అన్యాయం జరగకూడదన్నారు. పారదర్శకంగా పనులు నిర్వహించాలని అన్నారు. గ్రామీణ ఉపాధి హామీ పథకం లక్ష్యం గ్రామీణ ఆర్థికాభివృద్ధి. దీనిని క్షేత్రస్థాయిలో నిజం చేయాల్సిన బాధ్యత మనందరిదని ఆమె అన్నారు. ఈ సమీక్ష సమావేశంలో ఏపీఓ ఎం శైలజ, ఈసీ లక్ష్మా నాయక్, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీడీ నిర్మలాదేవి

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యం కావాలి: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-మార్కాపురం

ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ యజ్ఞంషి చేయాలని మార్కాపురం ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి విజ్ఞప్తి చేశారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో 'స్వచ్ఛ ఆంధ్ర –స్వర్ణ ఆంధ్ర' కార్యక్రమాన్ని ఎమ్మెల్యే కందుల శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గాంధీ పార్క్ వద్ద ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి మొక్కలు నాటారు. అనంతరం జాతిపిత మహాత్మా గాంధీ విగ్రహానికి పూలమాల వేశారు. పక్షుల కోసం ఏర్పాటు చేసిన నీటి తొట్లలో శ్రీషరు పోశారు. చలివేంద్రాన్ని ప్రారంభించారు. ఆ తరువాత మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ కార్యక్రమం చేపట్టారు. అనంతరం గడియార స్తంభం సెంటర్ నుంఎతీ దోర్నాల బస్టాండ్ వరకు స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కందుల నారాయణరెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్లాస్టిక్ వాడకానికి దూరంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాలలో చెత్త వేయవద్దని కోరారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ కమిషనర్ డివిఎస్ నారాయణరావు, టిడిపి నాయకులు వక్కలగడ్డ సురేష్‌కుమార్, మాలపాటి వెంకటరెడ్డి, తాళ్లపల్లి వెంకట సత్యనారాయణ, మయూర్ ఖాశిం, పిహెచ్ ఖాన్, బిజెపి నియోజకవర్గ ఇన్‌చార్జి పివి క్రిష్ణారావు తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న ఎమ్మెల్యే కందుల నారాయణరెడ్డి



కార్యక్రమంలో మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు

పర్యావరణంపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి-సంతనూతలపాడు

పర్యావరణంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంచుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు నెరుసుల వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక సుందరయ్య భవన్‌లో ప్రకాశం బాలోత్సవ్ కార్యక్రమంలో భాగంగా 9వ రోజున ఆయన పాల్గొని పర్యావరణం–దాని ప్రభావం గురించి పిల్లలకు వివరించారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ పర్యావరణ రక్షణ గురించి విద్యార్థి దశ నుంచే పిల్లలు అలవర్చుకోవాలని అన్నారు. భూమి మీద అనేక కార్బన్ ఉద్గారాలు, విషవాయువులు వెలువడటం వలన భూమి ఉష్ణోగ్రత పెరిగి సమతుల్యత దెబ్బతింటుందని, ఇది మానవ మనుగడకే ప్రశ్నార్థకంగా మారుతున్నదన్నారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు ప్రజలందరి మీద ఉన్నదని అన్నారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించాలని అన్నారు. చెట్లు పెంచాలని పర్యావరణాన్ని కాపాడుకోవాలని ఆయన వివరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు ఐద్వా మండల కార్యదర్శి ఎన్ మాలతి, రాధ, విద్యార్థులు పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు

'సూర్య ఘర్'పై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో పిఎం సూర్య ఘర్‌పై అవగాహన సదస్సు స్థానిక చెన్నకేశవ మాన్యంలోని యన్‌టిఆర్ పార్కులో శనివారం నిర్వహించారు. విద్యుత్ శాఖ ఎస్ఇ కట్టా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సోలార్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా విద్యుత్ అందించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. గహాలకు తగిన రూఫ్ టాప్ సోలార్ ప్లాంట్ కెపాసిటీ, సబ్సిడీ, దీని ద్వారా ప్రజలు రూ.78 వేలు వరకు సబ్సిడీ పొందవచ్చని పేర్కొన్నారు. ఈ పథకం కింద గహ యాజమానుల ఇంటి పైకప్పులపై సోలార్ ప్యానెల్స్‌ను అమర్చుకోవడానికి 40 శాతం వరకు సబ్సిడీని క్లెయిమ్ చేయవచ్చన్నారు. సూర్యఘర్‌తో పాటు వాలంటరీ అదనపు లోడు క్రమబద్ధీకరణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఈఈ మాకినేని హరిబాబు, డిఈఈ పాండురంగారావు, ఏఈ శివప్రసాద్, టీడీపీ నాయకులు మండవ మురళీకష్ణ, మాలంపాటి కృష్ణ, చెన్నుపాటి ప్రసాద్, మేడికొండ మోహన్, 37వ డివిజన్ ప్రజలు పాల్గొన్నారు.


సీతారామయ్యను సత్కరిస్తున్న కొల్లా మధు

డాక్టర్ సీతారామయ్యకి సన్మానం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ప్రకాశం జిల్లా సహకార కేంద్ర బ్యాంకు చైర్మన్‌గా ఎంపికైన డాక్టర్ కామేపల్లి సీతారామయ్యకి ఒంగోలు మెడికల్ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ రిటైల్ అసోసియేషన్ సభ్యులు శనివారం శుభాకాంక్షలు తెలిపారు. అసోసియేషన్ సభ్యులు సీతారామయ్యను ఆయన హాస్పిటల్‌లో కలిసి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ టౌన్ ప్రెసిడెంట్ వెంకారెడ్డి, కోశాధికారి వై.ఏడుకొండలు, టౌన్ వైస్ ప్రెసిడెంట్ కొల్లా మధు, జిల్లా ఈసీ సభ్యులు రఘురామిరెడ్డి పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

చలివేంద్రం ఏర్పాటు

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

'బీట్ ద హీట్' (ఎండ తీవ్రతను అధిగమించుట) కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు ఒంగోలు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 'చలివేంద్రం'ను మండల పరిషత్ అభివద్ధి అధికారి కె.రాజశేఖరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలో వివిధ గ్రామాల నుంచి కార్యాలయ పనుల నిమిత్తం వచ్చే ప్రజలు ఇబ్బంది పడకుండా ఎండ తీవ్రత నుండి తట్టుకోవటానికి తాగు నీరు సౌకర్యం కల్పించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఉపమండల పరిషత్ అభివద్ధి అధికారి ఎ.బాలచెన్నయ్య, పంచాయతీ రాజ్ సహాయక ఇంజనీర్ యన్.శివరామప్రసాద్, కార్యాలయ పరిపాలనాధికారి యు. శేషుబాబు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్‌స్టేషన్‌లో పరిసరాల పరిశుభ్రత

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

'స్వచ్ఛ ఆంధ్ర' ప్రోగ్రాంలో భాగంగా ఒంగోలులోని తాలుకా పోలీస్ స్టేషన్‌లో ఒంగోలు రూరల్ సిఐ, తాలూకా ఇన్‌ఛార్జి సిఐ ఎన్. శ్రీకాంత్ బాబు ఆధ్వర్యంలో పరిసరాల పరిశుభ్రత కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో తాలూకా ఎస్ఐ సందీప్, రైటర్ శివ, సిబ్బంది పాల్గొన్నారు.


'స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో సిఐ శ్రీకాంత్

మాజీ ఐఏఎస్‌లపై

కక్ష సాధింపు రాజకీయాలు తగవు..

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

మీడియా సమావేశంలో వైసిపి నేతలు


మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మాజీ ముఖ్యమంత్రి వైసిపి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఒఎస్‌డి కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఐఎఎస్ అధికారి ధనుంజయ్‌రెడ్డిల అరెస్ట్ అక్రమమని వైసిపి నేతలు ఆరోపించారు. కష్ణమోహన్‌రెడ్డి, ధనుంజయరెడ్డిలను లిక్కర్ స్కామ్ పేరుతో అక్రమ అరెస్ట్‌ను ఖండిస్తున్నట్లు శనివారం సాయంత్రం వైసిపి జిల్లా కార్యాలయం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు ప్రకటించారు. పార్టీ జిల్లా అధ్యక్షులు, దర్శి శాసన సభ్యులు డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జూపూడి ప్రభాకర్‌రావు, జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఒంగోలు నియోజకవర్గ ఇన్‌ఛార్జి చుండూరు రవి మాట్లాడారు. ప్రజలకు సేవ చేస్తున్న వారిపై కక్ష సాధింపు రాజకీయాలతో చంద్ర బాబు చేస్తున్న దాడిగా వారు పేర్కొన్నారు. మొన్నటి వరకు సర్వీసులో ఉన్న పలువురు ఐపీఎస్, ఐఎఎస్ అధికారులపై చంద్రబాబు ప్రభుత్వం అమలు చేస్తున్న 'రెడ్ బుక్ రాజ్యాంగాన్ని' రాష్ట్ర ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు. ఇప్పుడు రిటైర్డ్ అధికారుల మీద కూడా కక్ష చూపిస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు చేస్తున్న కక్ష రాజకీయాల వల్ల వ్యవస్థలు దెబ్బ తింటున్నాయన్నారు. పరిపాలనలో చంద్రబాబు ఘోరంగా విఫలం కావడంవల్లే ప్రజల దష్టిని మళ్లించేందుకు తప్పుడు రాజకీయాలు చేస్తున్నారని 'రాష్ట్రంలో డైవర్షన్ పాలిటిక్స్' అమలు చేస్తున్నారని దుయ్యబట్టారు. సమావేశంలో వైసిపి రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పాలడుగు రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల పట్ల జాగ్రత్తగా ఉండాలి

ప్రజాశక్తి-ఒంగోలు సబర్బన్

మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు


ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేస్తున్న మేయర్ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు

ప్రజలంతా తగు జాగ్రత్తలు తీసుకొని ఈ ఎండలను అధిగమించాలని నగరపాలక సంస్థ మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ కె.వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతి నెలా మూడో శనివారం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 'స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమంలో భాగంగా ఈ నెల మూడో శనివారం 'బీట్ ది హిట్' థీమ్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కర్నూల్ రోడ్డు ఫ్లైఓవర్ వద్ద అడ్డా కూలీలకు మెడికల్ క్యాంపు నిర్వహించారు. కూలీలకు బిపి, షుగర్ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. అనంతరం చర్చి సెంటర్ లోని ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద వాహనదారుల కోసం ఏర్పాటుచేసిన షెడ్లను ప్రారంభించారు. తర్వాత నగరపాలక సంస్థ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతను పరిశీలించారు. కార్యక్రమంలో హెల్త్ ఆఫీసర్ వైష్ణవి, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య, శానిటరీ సూపర్వైజర్ ఎన్ పిచ్చయ్య, ఇన్స్పెక్టర్ షేక్ బాబ్జి, కార్పొరేషన్, సచివాలయాల సిబ్బంది, పలువురు ప్రభుత్వ వైద్యులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ


నిరసన తెలుపుతున్న సిహెచ్‌ఒలు

ఆయుష్మాన్ భారత్ నిబంధనల ప్రకారం ఆరు సంవత్సరాలు పనిచేసిన విలేజ్ క్లినిక్ కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్‌ను క్రమబద్ధీకరించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌లలో పని చేసే కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ ఒంగోలు కలెక్టరేట్ వద్ద చేపట్టిన సమ్మె శనివారం నాటికీ 19వ రోజుకు చేరింది. కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్స్ న్యాయమైన డిమాండ్లు వెంటనే పరిష్కరించాలని, తమకు న్యాయం చేయాలని, తమ డిమాండ్లపై చర్చించేందుకు చర్చలకు ప్రభుత్వం ఆహ్వానించాలని వారు నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మందగిరి రాజేష్,నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్ షేక్ అదిల్, జిల్లా సెక్రెటరీ గంటా ప్రసన్న, జిల్లా ఉపాధ్యక్షురాలు జీవనజ్యోతి, పసుపులేటి శైలజ, దీప్తి, కామేష్, రమాదేవి పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు అందజేత

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్


బహుమతులు అందజేస్తున్న కమిషనర్, ఏసీ

ఒంగోలులోని జిల్లా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం కొనసాగుతోంది. శనివారం నాడు స్వర్ణ ఆంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వేసవి విజ్ఞాన శిబిరంలో నగర పాలక సంస్థ, జిల్లా కేంద్ర గ్రంథాలయం సంయుక్త ఆధ్వర్యంలో ప్రకతిపై విద్యార్థులకు డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు ఒంగోలు కార్పొరేషన్ కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, అసిస్టెంట్ కమిషనర్ కొండయ్య బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉప గ్రంథ పాలకురాలు బొమ్మల కోటేశ్వరి, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

త్రిపుల్ ఐటీని తరలించొద్దు..

ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ

ప్రజాశక్తి - ఒంగోలు సిటీ

ఆరేళ్లుగా నిర్వహిస్తున్న 'ఒంగోలు త్రిపుల్ ఐటీ'ని తరలింపు పేరుతో విద్యార్థుల జీవితాలతో ఆడుకోవద్దని ఎస్ఎఫ్ఐ హితవు పలికింది. శనివారం నాడు ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ తరపున సిహెచ్ వినోద్ మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం త్రిపుల్ ఐటీ తరలింపు అంశం తెరపైకి తెచ్చి విద్యార్థులను గందరగోళానికి గురి చేస్తున్నట్లు ఆరోపించారు. 2016లో ప్రకాశం జిల్లాకు కేటాయించిన ట్రిపుల్ ఐటి పేరుకు ప్రకటించారు తప్ప సొంత భవన నిర్మాణం చేపట్టలేదన్నారు. 10 ఏళ్లుగా ట్రిపుల్ ఐటికి శాశ్వత భవనం నిర్మించని కారణంగా విద్యార్థులు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. నేటికీ శాశ్వత భవనం నిర్మించాలనే ఆలోచన ప్రభుత్వానికి లేకపోవడాన్ని ఎస్ఎఫ్ఐ ప్రకాశం జిల్లా కమిటీ ఖండిస్తున్నట్లు ప్రకటించారు. ట్రిపుల్ ఐటి చదవాలంటే 3 ప్రాంతాలు మారాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మొదటి సంవత్సరం ఇడుపులపాయలో చదవాలని, తరువాత 2 సంవత్సరాలు రావ్ అండ్ నాయుడు కాలేజీ క్యాంపస్‌లో, చివరి 3 సంవత్సరాలు యస్.యస్.యన్ క్యాంపస్‌లో చదవాలని, ఇలాంటి వింత పరిస్థితి ట్రిపుల్ ఐటి చదువుకు రావడం దురదృష్టకరమన్నారు. 2016 ఒంగోలుతో పాటు శ్రీకాకుళం జిల్లాకు కేటాయించిన ట్రిపుల్ ఐటి భవనం నిర్మాణం పూర్తయి.. అక్కడ కొనసాగుతుందని ఈ సందర్భంగా గుర్తు చేశారు. కాగా కడప జిల్లా ఇడుపులపాయలో ఒంగోలు విద్యార్థులను చులకనగా చూస్తూ గొడవలు పడ్డ సంఘటనలు వున్నాయని, అయినప్పటికీ గత్యంతరం లేక అక్కడే చదువు సాగిస్తున్నారని తెలిపారు. ఇదిలాఉండగా రావ్ అండ్ నాయుడు కాలేజీ క్యాంపస్‌లో తాగునీరు, ఇతర సదుపాయాలు లేకున్నా సర్దుకుంటున్నారని, ఎలుకలు కొరుకుతున్నాయని విద్యార్థులు బయటకు వచ్చి ఆందోళన చేసిన ఘటనలు వున్నాయన్నారు. ప్రభుత్వం నిధులు కేటాయించి సొంత భవనం నిర్మించాలనే ఆలోచన కాకుండా అద్దెలు తగ్గించుకోవడానికి ఇతర ప్రాంతాల్లో ట్రిపుల్ ఐటిలకు విద్యార్థులను తరలించాలనే ఆలోచన చేస్తున్నట్లు వార్తా కథనాలు వస్తున్నాయన్నారు. దీంతో ప్రభుత్వ నిర్ణయాల పట్ల విద్యార్థులు బెంబేలెత్తుతున్నారని పేర్కొన్నారు. ట్రిపుల్ ఐటికి తక్షణమే స్థలం కేటాయించి శాశ్వత భవనం నిర్మాణం ప్రారంభించాలని, అద్దె భారం తగ్గించుకోవడానికి ఒంగోలు విద్యార్థులను ఇతర ట్రిపుల్ ఐటీలకు తరలించవద్దని డిమాండ్ చేశారు.


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

ఉద్యోగాలకు 32 మంది ఎంపిక

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

శ్రీ హర్షిణి డిగ్రీ, పీజీ కళాశాలలో శనివారం సియట్ కంపెనీ, హెట్రో కంపెనీలు నిర్వహించిన ప్రాంగణ ఎంపికలలో కళాశాల విద్యార్థులు 32 మంది ఎంపికయ్యారు. సియట్ కంపెనీలో 2.4 లక్షల ప్యాకేజీతో 24 మంది, హెట్రో కంపెనీలో 2.8 లక్షల ప్యాకేజీతో 8 మంది ఎంపికయ్యారు. ఈ సందర్భంగా జరిగిన అభినందన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం డిగ్రీతో పాటు ప్రాంగణ ఎంపికలు నిర్వహిస్తున్న ఏకైక విద్యాసంస్థ శ్రీ హర్షిణి అని తెలియజేశారు. కళాశాల స్థాపించిన మొదటి సంవత్సరం డిగ్రీ చేరిన విద్యార్థులకు పోటీ పరీక్షలను దష్టిలో ఉంచుకొని క్యాంపస్ ప్లేస్మెంట్స్‌కు కావలసిన అర్థమెటిక్, రీజనింగ్, సాఫ్ట్ స్కిల్స్ ఉచితంగా నేర్పిస్తున్నామన్నారు. ఎంపికైన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. ఈ విద్యా సంవత్సరం నుండి 100 శాతం ప్లేస్‌మెంట్స్ లక్ష్యంగా శ్రీ హర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ గోరంట్ల కవిత, ప్రిన్సిపల్ దాది ఆంజనేయులు, పీజీ కోఆర్డినేటర్ శ్రీనివాస రెడ్డి, ఏవో ర్యాంకర్ శ్రీనివాసరావు, క్యాంపస్ ఇన్‌చార్జ్ ధిరీష్, సిబ్బంది పాల్గొన్నారు.


సాయం అందిస్తున్న దృశ్యం

వైద్యఖర్చులకు ఆర్థిక సాయం

ప్రజాశక్తి - పర్చూరు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నూతలపాడు గంగ, సపోర్ట్ సహాయంతో అక్కడ పనిచేసే అద్దంకి శ్రీనివాసరావుకు ఆరోగ్య సమస్యల పరిష్కారంకు వైద్య ఖర్చుల కోసం రూ.25వేల ఆర్థిక సహాయాన్ని క్లబ్ అధ్యక్షుడు తోకల కృష్ణమోహన్ శనివారం అందజేశారు. శ్రీనివాసరావు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో రోటరీ కార్యదర్శి కోమటి ఆంజనేయులు, సపోర్ట్ అధ్యక్షుడు నాగబైరు శ్రీనివాసరావు, కార్యదర్శి పంబి సదానందరెడ్డి, భవనం రాజగోపాలరెడ్డి, పాబోలు వెంకటేశ్వర్లు, పోలిశెట్టి చంద్రశేఖరరావు, కారుమూడి సుబ్బారెడ్డి పాల్గొన్నారు.


ఇఒకు విరాళాలు అందజేస్తున్న భక్తులు

మండప నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి రాతి ముఖ మండప నిర్మాణానికి శనివారం భారీగా విరాళాలు అందించారు. మహా కుంభాభిషేకం సంకల్పించిన క్రమంలో భక్తులు కామేపల్లి లక్ష్మీప్రసాద్ రూ.2,01,116, కొరిశపాడు మండలం రావినూతల గ్రామానికి చెందిన పుట్ట భాస్కరరావు, లక్ష్మీ దంపతులు మారుతి భవన్ ఆధునీ కరణకు అవసరమైన ఎసి, గీజర్, మంచం విరాళంగా అందించారు. నాగులపాడు గ్రామానికి చెందిన అడుసుమలు వెంకటేశ్వర్లు, అరుణ దంపతులు రూ.1.00,359, పట్టణానికి చెందిన చిన్ని అంజిబాబు, శ్రీదేవి దంపతులు రూ.1,01,116, తిమ్మాయపాలెంకు చెందిన అల్లంనేని పూర్ణచంద్రరావు, పద్మజ దంపతులు రూ.1,05,116 దేవస్థానం సహాయ కమిషనర్, ఇఒ మదమంచి తిమ్మనాయుడుకు విరాళాలు అందించారు. కార్యక్రమంలో సందిరెడ్డి రమేష్, సందిరెడ్డి శ్రీనివాసరావు, చిన్ని మురళి సుధాకరరావు, ఆలయ అర్చకులు కోట గిరిధర కిషోర్ పాల్గొన్నారు.


నగదు ప్రోత్సాహం అందిస్తున్న అధికారులు

ఆర్టీసీ సిబ్బందికి అభినందన

ప్రజాశక్తి - బాపట్ల

ఆర్టీసీ డిపోలో అత్యధిక ఇంధనం పొదుపుకు కృషి చేస్తున్న డ్రైవర్లు చిత్తశుద్ధితో ఉద్యోగ బాధ్యతలు నిర్వహించి అత్యధిక ఆదాయం సమకూర్చి పెట్టి ఆర్టీసీని లాభాల బాటలో నడుపుతున్న కండక్టర్ల కృషి అభినందనీయమని ఆర్టీసీ డిపో మేనేజర్ బి శ్రీమన్నారాయణ అన్నారు. స్థానిక కొత్త బస్టాండులో జరిగిన కార్యక్రమంలో అత్యధిక ఇంధన పొదుపు చేసిన డ్రైవర్లను, కలెక్షన్ అత్యధికంగా తీసుకొచ్చిన కండక్టర్లకు ఏర్పాటు చేసన అభినందన కార్యక్రమంలో నగదు ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్రలో భాగంగా బస్ స్టేషన్ ప్రాంగణంలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్టీసి సిబ్బందితో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిపోలో సిబ్బంది, అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.


పని ప్రదేశాల్లో కూలీలతో మాట్లాడుతున్న సుబ్బారావు

'ఉపాధి'ని కాపాడుకోవాలి

ప్రజాశక్తి - కొల్లూరు

మండలంలోని లంక గ్రామాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాలు సందర్శించి కూలీలతో జిల్లా సహాయ కార్యదర్శి బొనిగల సుబ్బారావు మాట్లాడారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పని దినాలు కల్పించాలని, రూ.600 రోజు వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ పథకాన్ని నీరుకార్చే విధంగా కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం చూస్తుందని, కేంద్ర ప్రభుత్వ గతేడాది కంటే ఈ ఏడాది వ్యవసాయ కూలీలకు ఉపాధి హామీ నిధులు తగ్గించిందని అన్నారు. పనిముట్లు కూలీలకు అందించకుండా కాలయాపన చేస్తుందని అన్నారు. వేసవి అలవెన్స్ ఇవ్వకుండా ఎండలు విపరీతంగా ఉన్నప్పటికీ టెంట్లు, మంచినీటి సౌకర్యం కల్పించడం లేదని అన్నారు. సమాన పనికి సమాన వేతనం వచ్చే విధంగా చూడాలని, ఉపాధి హామీ పథకాన్ని రక్షించుకునేందుకు దేశవ్యాప్తంగా ఉపాధి హామీ, వ్యవసాయ కార్మికుల రక్షణకై దేశం మొత్తం వ్యవసాయ కూలీలు బంద్ చేపడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో గ్రామం నుండి మేట్లు, కూలీలు పాల్గొన్నారు.


మొక్కలు నాటుతున్న ఎంఎల్ఎ నరేంద్రవర్మ

భావితరాల కోసం ప్రకృతిని కాపాడదాం

ప్రజాశక్తి - బాపట్ల

ప్రకృతిలో చోటు చేసు కుంటున్న అనూహ్యమైన మార్పులతో ఏర్పడుతున్న కాలుష్యాన్ని నివారించేం దుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షిం చాలని శాసన సభ్యులు వేగేశన నరేంద్ర అన్నారు. స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని పట్టణంలోని 9వ వార్డు చిల్లర గొల్లపాలెం, మూర్తి రక్షణ నగర్‌లో శనివారం ఆయన మొక్కలు నాటి ప్రారంభించారు. ప్రకృతిని పరిరక్షిస్తేనే భావితరాలను కాపాడగలమని అన్నారు. పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి జీవనశైలిలో భాగం కావాలని అన్నారు. గృహ సముదాయాల ప్రాంతంలో మొక్కలు పెంచటం ద్వారా వాతావరణంలో ఉష్ణోగ్రతలు తగ్గించగలమని అన్నారు. ప్రతి నెల 3వ శనివారం నిర్వహించే స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని 'బీట్ ది హీట్' నినాదంతో నిర్వహించారు. కార్యక్రమంలో డీఆర్ఓ గంగాధర్‌గౌడ్, ఆర్డిఓ పి గ్లోరియా, మండల స్పెషల్ ఆఫీసర్ శివ లీల, తహశీల్దారు సలీమా, మున్సిపల్ కమిషనర్ రఘునాథరెడ్డి, టిడిపి పట్టణ అధ్యక్షులు గొలపల శ్రీనివాసరావు, ధారా అశోక్, ప్రభుత్వ వైద్యశాల డైరెక్టర్ కొల్లూరి వెంకట్రావు పాల్గొన్నారు.

రూ.5 కోట్ల నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి - భట్టిప్రోలు


మాట్లాడుతున్న ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం బాపట్ల జిల్లా అధ్యక్షులు సత్యనారాయణ

రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు త్రిఫ్ట పండు కంట్రిబ్యూషన్‌కు బడ్జెట్లో కేటాయించిన రూ.5కోట్ల నిధులు వెంటనే విడుదల చేయాలని ఎపి చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మురుగుడు సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు దీపాల సత్యనారాయణ డిమాండ్ చేశారు. స్థానిక ప్రజా సంఘాల కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బడ్జెట్లో ఆమోదించిన రూ.5 కోట్లను ఇంతవరకు విడుదల చేయలేదని, వెంటనే విడుదల చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం ప్రకటించి రెండు నెలలు కావస్తున్నప్పటికీ ఇంతవరకు అమలు గురించి స్పష్టమైన విధానమేదీ ప్రభుత్వం ప్రకటించ లేదని అన్నారు. నేత నేస్తున్న చేనేత కార్మికులకు అనుబంధ వృత్తులు చేస్తున్న వారిని సర్వే చేసి ఈ పథకం వర్తింప జేయాలని కోరారు. చేనేత నిల్వ ఉత్పత్తులను ప్రభుత్వం ఆప్కో ద్వారా కొనుగోలు చేయించి చేనేతలకు పని కల్పించాలని కోరారు. రాష్ట్రంలో చేనేత సహకార సంఘాలకు రావాల్సిన బకాయిలు రూ.156 కోట్లు వెంటనే విడుదల చేసి సహకార సంఘాల్లో కార్మికులకు పని చూపించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సహకార సంఘాలకు పాలకవర్గాలు లేకపోవడం వల్ల కార్మికులకు పని కల్పించడం, మజూరీలు, ఆర్థిక లావాదేవీలు ఇబ్బందిగా ఉందని తెలిపారు. గతేడాది ఆగస్టు 7న విజయవాడలో చేనేత సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేనేత కార్మికులకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.

సిఎం సహాయనిధి పేదలకు వరం

శాసనసభ్యులు ఎంఎం కొండయ్య

ప్రజాశక్తి - చీరాల


సీఎం రిలీఫ్ ఫండ్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య

రాష్ట్రంలోని నిరుపేదలకు వైద్య సహాయం అందించేందుకు ముఖ్య మంత్రి సహాయ నిధి (సీఎం రిలీఫ్ ఫండ్) ఎంతో ఆసరాగా నిలుస్తోందని, పేదలకు వరమని శాసన సభ్యులు కొండయ్య అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని 27 మంది లబ్ధిదారులకు ముఖ్య మంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.28 లక్షల విలువైన చెక్కులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణాంతక వ్యాధులు, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న పేదలకు సిఎం సహాయ నిధి ద్వారా ఆర్థిక సహాయం అందుతోందని అన్నారు. ఎన్టీఆర్ వైద్య సేవ పథకం పరిధిలోకి రాని కొన్ని ప్రత్యేకమైన వైద్య చికిత్సలకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం పొందవచ్చని అన్నారు. కూటమి ప్రభుత్వం నిరుపేదల వైద్యానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఇందులో భాగంగానే సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఎంతో మందికి సహాయం అందిస్తోందని అన్నారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య సహకారంతోనే తమకు సీఎం రిలీఫ్ ఫండ్ అందిందని, అందుకు ఆయనకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న తమకు ఎమ్మెల్యే చొరవతో సరైన సమయంలో ఆర్థిక సహాయం అందడం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి కూటమి నాయకులు పలువురు పాల్గొన్నారు.

సాగు హక్కు గుర్తింపు కార్డులతో ప్రయోజనం


మాట్లాడుతున్న నగరం తహశీల్దారు జి నాంచారయ్య

ప్రజాశక్తి - నగరం

మండలంలోని పెదమట్లపూడి, చినమట్లపూడి సచివాలయాల పరిధిలో తహశీల్దారు జి నాంచారయ్య అధ్యక్షతన పంట సాగుదారుల హక్కు పత్రాలపై అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కౌలు రైతు చట్టం 2019 ప్రకారం కౌలు రైతులు ప్రభుత్వ పథకాల ద్వారా లబ్ధి పొందటానికి గుర్తింపు కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. కార్డు తీసుకున్న రైతుకు 11 నెలల వరకు పండించే పంటపై హక్కు కలిగి వుంటాడని తెలిపారు. కార్డులు అందజేసేందుకు కౌలు రైతులను గుర్తిస్తున్నట్లు చెప్పారు. ఎఒ వి రమేష్ బాబు మాట్లాడుతూ కౌలు రైతు కార్డు పొందటం ద్వారా అన్నదాత సుఖీభవ, సున్నా వడ్డీ పంట రుణాలు, పంటల భీమా, పంట నష్ట పరిహారం, పండించిన పంట అమ్ముకోవ డానికి, పంట రుణాలు పొందటానికి సిసిఆర్‌సి కార్డు ఉపయోగ పడుతుందని తెలిపారు. సచివాలయంలోని విఆర్‌ఒలను సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ఎఇఒ కె నాగ శ్రీనివాసరావు, విఆర్‌ఒలు, పెదమట్లపూడి సర్పంచ్ లుక్కా బాపయ్య, చినమట్లపూడి టీడీపీ నాయకులు షేక్ కరిముల్లా పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని దగ్గుబాడు రైతు సేవ కేంద్రం పరిధిలో పంట సాగుదారుల హక్కు పత్రాలపై శనివారం అవగాహన సదస్సు రెవిన్యూ, వ్యవసాయ శాఖలు సమన్వయంగా ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎఒ కె సుధీర్ బాబు మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, జనుము విత్తనాలు కావలసిన రైతులు రైతు సేవకేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులను సంప్రదించి ఆధార్ కార్డ్, పట్టాదారు పాసుబుక్ జిరాక్స్ కాపీలను రైతు సేవ కేంద్ర నందు నమోదు చేసుకోవాలని తెలిపారు. పంటల భీమా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంట నష్టం, విత్తనాలు తదితర సౌకర్యాలు పొందే అవకాశం ఉందన్నారు. కౌలు కార్డ్స్ తీసుకోవటం వలన కౌలు రైతులకు ఎటువంటి భూమి హక్కు కౌలు రైతుకు సంక్రమించదని ఆర్ఐ ఎం రాజేష్ తెలిపారు. కౌలు రైతు గుర్తింపు కార్డు తీసుకోవడం వల్ల ప్రభుత్వం రైతులకు అందించే సంక్షేమ పథకాలు వీరికి కూడా వర్తిస్తాయని అన్నారు. గుర్తింపు కార్డు తీసుకోవాల్సిన రైతులు ఆయా గ్రామాల విఆర్‌ఒలను సంప్రదించి కౌలు రైతులు గుర్తింపు కార్డులు తీసుకోవాలని అన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులను కలిసి సంబంధిత ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని అన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు షేక్ ఖాసీం, విఆర్ఒ శ్రీలక్ష్మి, విఎఎ సిహెచ్ కిషోర్, దగ్గుబాడు రైతులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కారంచేడు ఎఒ కె సుధీర్‌బాబు

ప్రశాంతంగా ముగిసిన తిరుణాళ్ల

ప్రజాశక్తి-పీసీపల్లి

మంగళవారం నుంచి శనివారం వరకు జరిగిన పాలేటి గంగమ్మ తిరునాళ్ల ప్రశాంతంగా ముగిసిందని ఎస్ఐ జి.కోటయ్య తెలిపారు. శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, 9 విద్యుత్ ప్రభలు, కోలాటం లాంటి కార్యక్రమాలకు, విద్యుత్ ప్రభల వద్దకు హాజరైన ఆయా పార్టీల నాయకులు, లక్షకు పైగా భక్తులు హాజరయ్యారని తెలిపారు. కనిగిరి డిఎస్పి సాయి ఈశ్వర్ యశ్వంత్ ఆదేశాలతో కనిగిరి సీఐ ఖాజావలి పరిరక్షణలో శాంతిభద్రతలను పర్యవేక్షించామని స్థానిక ఎస్సై జి కోటయ్య తెలిపారు. గుడి ఆవరణలోకి వచ్చేందుకు వృద్ధులు, వికలాంగులు, చంటి పిల్లల కోసం ఉచిత ఆటోలను ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. భారీగా హాజరవుతారని అంచనాతో ముందుగానే ట్రాఫిక్ నియంత్రణను చేపట్టామన్నారు. శుక్రవారం మధ్యాహ్నం నుంచి వాహనాలు నిలిపే ప్రదేశాలను కూడా ఏర్పాటు చేసి వాహనాలు ఉంచామన్నారు. దీంతో గుడి పరిసర ప్రాంతాల్లో ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా అవాంఛనీయ సంఘటన జరగకుండా జరిగిందని ఆయన తెలిపారు.

ట్రాఫిక్‌ను కంట్రోల్ చేసిన ఎమ్మెల్యే ఉగ్ర

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి స్వయంగా శుక్రవారం రాత్రి పెద్ద అలవలపాడు వద్ద ట్రాఫిక్‌ను దగ్గరుండి కంట్రోల్ చేయించారు. భక్తులు లక్ష మంది దాకా వస్తారని అంచనాలతో ఉన్నారు. కానీ అంతకుమించి రావటంతో రాత్రి 9 గంటల సమయంలో ఒక్కసారిగా ట్రాఫిక్ కిక్కిరిసింది. ఒకేసారి వాహనాల ఎక్కువగా రావడంతో రద్దీ పెరిగింది. పది మీటర్లు ప్రయాణించాలన్నా గంట సమయం పట్టే పరిస్థితి వచ్చింది. ఆ సమయంలో గంగ తిరుణాళ్ల వద్దకు వస్తున్న ఎమ్మెల్యే దగ్గరుండి, తన అనుచరులతో ట్రాఫిక్‌ని క్రమబద్ధీకరించారు. స్వయంగా ఆయన కూడా అక్కడే ఉండి వచ్చే వాహనాలను ఒకవైపుకు పోవాలని ఆదేశించారు. దీంతో పలువురు ఎమ్మెల్యే ఉగ్రను అభినందించారు.



మాట్లాడుతున్న కేజీ మస్తాన్

ఉపాధి బకాయిలు విడుదల చేయాలి

ప్రజాశక్తి-కొండపి

ఉపాధి హామీ పథకంలో పెండింగ్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర నాయకుడు కేజీ మస్తాన్ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని మిట్టపాలెంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పనులు చేస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కేజీ మస్తాన్ మాట్లాడుతూ వారానికి ఒకసారి ఉపాధి కూలీలకు వేతనాలు చెల్లిస్తామని ప్రభుత్వాలు చెప్పినప్పటికీ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎందుకు విడుదల చేయడం లేదని ప్రశ్నించారు. ఉపాధి హామీ పథకం చట్టంలో నిలిచిన వేతనాలకు వడ్డీతో సహా కలిపి ఇవ్వాలని ఉందని, పెండింగ్ బకాయిలకు వడ్డీతో సహా కూలీలకు చెల్లించాలని డిమాండ్ చేశారు. 20వ తేదీన జరిగే నిరసన కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఉపాధి హామీకి ఉరివేస్తున్న మోడీ ప్రభుత్వ విధానాలపై ప్రతిఘటించాలని కోరారు. క్షేత్రస్థాయి సిబ్బందిపై రాజకీయ నాయకుల వేధింపులను అరికట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి శ్రీనివాసరావు, యోసేపు, ఆదాము, జయమ్మ, సుశీలమ్మ, తదితరులు పాల్గొన్నారు.

19న కార్యకర్తల సమావేశం

ప్రజాశక్తి-కొండపి

కొండపి నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం ఈనెల 19న నిర్వహించనున్నట్లు మాజీ ఏఎంసీ చైర్మన్ జి.రామయ్యచౌదరి తెలిపారు. కొండపిలో కామేపల్లి రోడ్డులోని శ్రీ సాయిసీతారామ కళ్యాణ మండపంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి అతిథిగా మంత్రి స్వామి, మారిటైమ్ బోర్డు చైర్మన్ దామచర్ల సత్య పాల్గొంటారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నాయకులు, అనుబంధ విభాగాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

అల్లూరును క్లీన్ విలేజ్‌గా తీర్చిదిద్దాలి

కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నం-ప్రజాశక్తి

అల్లూరును క్లీన్ విలేజ్‌గా తీర్చిదిద్దాలని కలెక్టర్ తమీమ్ అన్సారియా అన్నారు. అల్లూరులో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కలెక్టర్ మొదటగా గ్రామంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభించారు. అనంతరం గ్రామంలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని సందర్శించారు. క్లాప్ మిత్రలతో మాట్లాడారు. చెత్త సేకరణ, పారిశుధ్య నిర్వహణ పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు చేపట్టాలని పంచాయతీ అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా చెత్త సంపద తయారీ కేంద్రం వద్ద కలెక్టర్ మొక్కను నాటారు. అనంతరం గ్రామంలో ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన పశువుల నీటి తొట్టెను, ఏర్పాటుచేసిన కంపోస్ట్ పిట్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం గ్రామంలో ఏర్పాటు చేసిన మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా మాట్లాడుతూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతే లక్ష్యంతో ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి నెలా మూడవ శనివారం ఒక్కొక్క నెల ఒక్కొక్క థీమ్‌తో స్వర్ణ ఆంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో ఒక గ్రామాన్ని మోడల్ గ్రామంగా ఎంపిక చేసి విజువల్ క్లీన్ విలేజ్‌గా తీర్చిదిద్దేలా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అల్లూరు గ్రామాన్ని కూడా విజువల్ క్లీన్ విలేజ్‌గా తీర్చి దిద్దాలన్నారు. కార్యక్రమంలో ఎంపిపి ఎల్.అంజిరెడ్డి, ఎంపిటిసి శాంతారావు, సర్పంచ్ నంబూరు సూర్యనారాయణ, ఆర్డీవో లక్ష్మీ ప్రసన్న, జడ్పీ సిఈఓ చిరంజీవి, డిపిఓ వెంకట నాయుడు, డ్వామా పిడి జోసెఫ్ కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బాల శంకర రావు, వైద్యాధికారి డా.వెంకటేశ్వరరావు, తహసీల్దార్ మధుసూదన్ రావు, ఎంపీడీవో క్రిష్ణ పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా



వడ్డెంపూడి వెంకట ఏర్పాటు చేసిన ప్రభపై టీడీపీ నాయకులు



బివిఆర్ కన్‌స్ట్రక్షన్ ప్రభ వద్ద ఎమ్మెల్యే ఉగ్ర

జోష్ నింపిన గంగ తిరుణాళ్ల

ప్రజాశక్తి-పీసీపల్లి

పాలేటి గంగమ్మ తిరునాళ్ల టిడిపి శ్రేణుల్లో జోష్ నింపింది. మంగళవారం నుంచి శనివారం వరకు వెంగళాపురం వద్ద తిరునాళ్ల నిర్వహించారు. శుక్రవారం సాయంత్రం విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా టిడిపి వారు ఏర్పాటు చేసిన ప్రభల వద్దకు అధికార పార్టీ నాయకులు రావటంతో టీడీపీ శ్రేణుల్లో జోష్ నింపింది. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి, చీరాల ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య, మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య హాజరయ్యారు. ప్రభల వద్ద వారు కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడటం టిడిపి శ్రేణులు కొత్త ఉత్సాహాన్ని నింపింది. ప్రధానంగా పోతవరం సర్పంచ్ రావి రాజా ఏర్పాటు చేసిన తడికల విద్యుత్ ప్రభ, అదే గ్రామానికి చెందిన వడ్డెంపూడి వెంకటరావు ఏర్పాటుచేసిన మరో ప్రభ, బివిఆర్ కన్స్ట్రక్షన్స్ అధినేత బండారు వెంకటరావు, శ్రీనివాసులు ఏర్పాటు చేసిన విద్యుత్ ప్రభలు మరియు కనిగిరి మండలం వెంకటేశ్వరపురం వారు ఏర్పాటు చేసిన ప్రజల వద్దకు వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రశాంతంగా తిరుణాళ్ల నిర్వహించుకోవాలన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలో జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆవేశాలకు గురికాకుండా ప్రశాంతంగా నిర్వహించాలన్నారు. వీరి వెంట మండల టిడిపి అధ్యక్షులు వేమూరి రామయ్య, మురుగుమ్మి ఎంపీటీసీ చెరుకూరి సతీష్ కుమార్, వీరపనేని పెద్దన్న మరియు కనిగిరి నియోజకవర్గంలోని తెలుగుదేశం శ్రేణులు హాజరయ్యారు. రాజకీయాలకు అతీతంగా కులాలవారీగా అన్నదాన సత్రాలను ఏర్పాటు చేసి వచ్చిన భక్తులందరికీ భోజన ఏర్పాటు చేయటం పట్ల కూడా నాయకులు సంతృప్తి వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే ఉగ్రను సన్మానిస్తున్న రావి రాజా, చెరుకూరి సతీష్



నాటికలోని ఓ సన్నివేశం

అలరించిన నాటిక పోటీలు

ప్రజాశక్తి-దర్శి : దర్శనాపురి నాటక కళాపరిషత్తు వారి ఆధ్వర్యంలో జరుగుతున్న పోటీల్లో రెండో రోజు సన్నివేశాలు అలరించాయి. మొదటగా సాయి ఆర్ట్ కలవకూరి వారు ప్రదర్శించిన "జనరల్ బోగీలు" నాటిక ఆకట్టుకుంది. చిలకలూరిపేట వారి ప్రదర్శించిన శ్రీ మధ్యకూరి ఆర్ట్ వారిచే ప్రదర్శించిన " మా ఇంట్లో మహాభారతం " అనే నాటికి కూడా అందరినీ అలరించింది. అదేవిధంగా హైదరాబాద్ వారి యువభేరి థియేటర్ ఆర్ట్స్ ప్రదర్శించిన "నా శత్రువు" నాటిక కూడా ప్రేక్షకులను అలరింపజేసింది. దర్శనాపురి నాటకళాపరిషత్తు అధ్యక్షులు కలవకలను అనంత కార్యదర్శి డాక్టర్ ప్రసాద్ రెడ్డి, ధనిరెడ్డి వెంకట్ రెడ్డి, రంగారావు, జివిజి కీర్తి జయేంద్ర రెడ్డి, మార్తల వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కొండపి

నేడు మండలంలోని పెరిదేపిలోని సీపీఎం కార్యాలయంలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఒంగోలులోని శ్రీరామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. వైద్య శిబిరంలో ఎముకలు, కీళ్లు, ప్రసూతి మరియు స్త్రీ వ్యాధులు, జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, న్యూరాలజీ, పల్మనాలజీ, డెంటల్, పీడియాట్రిక్స్, ఫిజియోథెరపీ వైద్య నిపుణులు వైద్య సేవలు అందిస్తారని అన్నారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బిపి, షుగర్, ఈసీజీ పరీక్షలు నిర్వహించి మందులు కూడా ఉచితంగా అందజేస్తారని తెలిపారు. కొండపి మండల ప్రజలు వైద్య శిబిరాన్ని వినియోగించుకోవలసిందిగా నిర్వాహకులు కోరారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న ట్రాక్టర్లు

చోరీ కేసులో నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి-పుల్లలచెరువు

పుల్లలచెరువు మండలంలోని ముటుకుల, కొండారెడ్డి కొష్టాలు గ్రామాలలో ట్రాక్టర్, ట్రక్కులు, రొటివేటర్ దొంగతనం కేసుల్లో నిందితుడిని అరెస్ట్ చేసినట్లు సిఐ సిహెచ్ ప్రభాకరరావు తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఎస్ఐ సంపత్ కుమార్ సమాచారం మేరకు ఈ నెల 10న ఈ కేసులో ఫిర్యాది అయిన వడితే వాగ్యా నాయక్ తన యజమానికి చెందిన ట్రాక్టర్, రోటోవేటర్‌తో వ్యవసాయం చేసి వాటిని గ్రామానికి ఆనుకొని వున్న మెయిన్ రోడ్డు పక్కన విష్ణువర్ధన్ రెడ్డి రేకుల షెడ్డును అద్దెకు తీసుకుని దానిలో పెట్టి తాళం వేసి వెళ్లాడు. అదే రోజు రేకుల షెడ్డు పగులగొట్టి లోపల ఉన్న ట్రాక్టర్, ట్రక్కు, రొటివేటర్లను, త్రిపురాంతకం మండలంలోని ఒక వాటర్ ట్యాంకర్, ముటుకుల గ్రామంలో ట్రాక్టర్ ట్రక్కును దొంగిలించుకు పోయారు. ట్రాక్టర్, రొటివేటర్ రూ.8 లక్షలు, నీళ్ల ట్యాంకర్ రూ.1.60 లక్షలు, ట్రక్కు రూ.2 లక్షలు, ట్రక్కు, రొటివేటర్ విలువ రూ.3 లక్షలు ఉంటుందన్నారు. ఈ నెల 16వ తేదీన పల్నాడు జిల్లా నూజెండ్ల మండలం మృత్యుంజయపురంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న దూదేకుల హుస్సేన్‌ను బొల్లాపల్లి మండలంలోని గుట్లపల్లి గ్రామం మెయిన్ రోడ్డు పక్కన ఉన్న బ్రహ్మంగారి గుడి వద్ద అరెస్ట్ చేసి దొంగతనానికి గురైన ట్రాక్టర్, ట్రక్కులు, రొటివేటర్, నీళ్ల ట్యాంకర్‌ను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ సంపత్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

డిజిపేటలో అక్రమాలపై విచారణ

ప్రజాశక్తి-సిఎస్ పురంరూరల్

మండలంలోని డిజిపేటలో డిఎల్పిఓ హనుమంతరావు శనివారం విచారణ చేపట్టారు. డిజిపేటలో పంచాయతీ నిధులలో అక్రమాలకు పాల్పడ్డారంటూ గ్రామానికి చెందిన పి.తిరుపతయ్య, వి.ప్రసాదు, జి.తిరుపతయ్య, బి.సుబ్బారావు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై ఫిర్యాదుదారులు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి తదితరులకు నోటీసులు జారీ చేసి కనిగిరి డిఎల్పిఓ హనుమంతరావు శనివారం డిజిపేట సచివాలయంలో విచారణ చేపట్టారు. వర్షం కారణంగా ఫీల్డ్ విజిట్ చేసే అవకాశం లేకపోవడంతో మరోసారి పూర్తి స్థాయిలో విచారణ చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోపీఆర్‌డీ రమణయ్య, కార్యదర్శి రమణ నాయక్, ఫిర్యాదుదారులు పి.తిరుపతయ్య, వి.ప్రసాదు, జి.తిరుపతయ్య, బి.సుబ్బారావు, ఎం.వెంకట్ కొండయ్య, వి.తిరుపతి వాసులు, జెమిని పాల్గొన్నారు.

సివిల్ సప్లయి అధికారుల విచారణ

ప్రజాశక్తి-మద్దిపాడు

మండల పరిధిలోని నందిపాడులో శనివారం సివిల్ సప్లయి అధికారులు విచారణ చేపట్టారు. కార్డుదారులకు బియ్యం ఇవ్వకుండానే అయిపోయాయని చెబుతున్నారని, అదేమని అడిగితే పక్క గ్రామానికి వెళ్లి తెచ్చుకోవాలని చెబుతున్నారని గ్రామానికి చెందిన ఓ వ్యక్తి జెసికి ఫిర్యాదు చేశారు. ఆయన ఆదేశాల మేరకు విచారణకు వచ్చినట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్ డిటి రాజ్యలక్ష్మి తెలిపారు. గ్రామంలో 20 మంది కార్డుదారులను విచారించి నివేదికను జెసికి అందజేస్తామని వారు తెలిపారు. ఈ విచారణలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వంశీ ఉన్నారు.

వాహనాల తనిఖీ

ప్రజాశక్తి-పొదిలి

ఒంగోలు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ భానుప్రకాష్, పొదిలి డిపో మేనేజర్ శంకర్ రావుల ఆధ్వర్యంలో శనివారం పొదిలి-అద్దంకి మార్గంలో ప్రత్యేకంగా వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్రమంగా తిరుగుతున్న ఆటోలను, టాటా మ్యాజిక్‌లను తనిఖీ చేసి లైసెన్స్ లేని డ్రైవర్లకు జరిమానాలు విధించారు. అదేవిధంగా ఫిట్‌నెస్‌లేని వాహనాలకు కేసులు రాసి వాటిని నిలిపివేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రయాణికులు లైసెన్స్ లేని మరియు ఫిట్నెస్ లేని ఆటోలు, టాటా మ్యాజిక్‌లలో ప్రయాణం చేయడం ప్రమాదమన్నారు.



మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతి

కేర్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - చీరాల

విద్యార్థులకు ట్యూషన్ సెంటర్ నిర్వహిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న కేర్ వాలంటీర్స్ ఆర్గనైజేషన్ సేవలు అభినందనీయమని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షులు బొమ్మల పరంజ్యోతి ప్రశంసించారు. ఐక్య నగర్‌లోని బిఎస్పీ కార్యాలయంలో కేర్ వాలంటరీ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ప్రతి ఏడాది లాగే ఈ ఏడాది కూడా ట్యూషన్ సెంటర్ నిర్వహించారు. కార్యక్రమంలో బిఎస్పీ నాయకులు గొర్రిపాటి రవి, ఆర్గనైజేషన్ ప్రతినిధులు ఎం రత్నకుమారి, డి మహేశ్వరి, నాగమ్మ పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న దృశ్యం

అమరులైన విప్లవ వీరులకు నివాళి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

శతజయంతి ఉత్సవాల్లో భాగంగా అమరులైన విప్లవ వీరులకు ఘనంగా నివాళులర్పించారు. మహిళా మండలి అధ్యక్షురాలు గోరంట్ల మల్లేశ్వరి 8వ వర్ధంతి సందర్భంగా సీనియర్ జర్నలిస్టు జీపీ వెంకటేశ్వర్లు నివాసంలో సంతాప సభ నిర్వహించారు. సీపీఐ సీనియర్ నాయకులు టీసీహెచ్ చెన్నయ్య అధ్యక్షత వహించారు. యర్రగొండపాలెంలో విశేష సేవలు అందించి అమరులైన బొట్లపల్లి ఇబ్రహీం, కొర్రపోలు పోలయ్య, నక్కా గాలెయ్య, గుర్రం చిన్న వెంకట స్వామి, గాలి సుబ్బరాయుడు, తాడి నాసరయ్య, యరజర్ల సాంబయ్య సేవలను గుర్తు చేసుకొని నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు కెవి కృష్ణగౌడ్, బాణాల రామయ్య, సాంబశివరావు, వైసీపీ సీనియర్ నాయకులు కె జానకిరఘు, కె కోటిరెడ్డి, ఆకుల నారాయణ, బంకా శ్రీనివాసరావు, పిడికిటి వెంకటనారాయణ, గుంటూరు శ్రీను, పి తిరుమలయ్య, నక్కా తిరుపతయ్య పాల్గొన్నారు.

వధూవరులకు ఎమ్మెల్యే ఆశీర్వాదం

ప్రజాశక్తి-కొమరోలు

మండలంలోని గుండ్రెడ్డిపల్లెలో దూదేకుల గుర్రయ్య కుమారుడు జమాల్ వివాహ వేడుకలకు గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. కార్యక్రమంలో సొసైటీ బ్యాంకు చైర్మన్ బిజ్జం రవీంద్రారెడ్డి, ఎల్‌కే టీ కాశయ్య, అనప వీరశేఖర్, దూదేకుల రంతూ, నాగూర్ పాల్గొన్నారు.

పొగాకు బేళ్ల అమ్మకాలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరు పొగాకు వేలం కేంద్రానికి జమ్ములపాలెం, తూమాడు గ్రామాలకు చెందిన రైతులు 780 బేళ్లు అమ్మకానికి తెచ్చారని వేలం నిర్వహణాధికారి అట్లూరి శ్రీనివాసరావు తెలిపారు. అందులో 582 బేళ్లు అమ్ముడు పోగా, వివిధ కారణాల చేత 198 బేళ్లను తిరస్కరించారు. కిలో పొగాకు అత్యధిక దర రూ.280, అత్యల్ప ధర రూ.205, సరాసరి ధర రూ.242.53 పలికింది.

కొండపి: శీతల గిడ్డంగుల్లో ఉన్న బేళ్ల వివరాలను తెలియపరచాలని వేలం నిర్వహణ అధికారి సునీల్ కుమార్ అన్నారు. క్లస్టర్ పరిధిలోని పెరిదేపి, మిట్టపాలెం, ముప్పా రాజుపాలెం గ్రామాలకు చెందిన రైతులు 725 బేళ్లను వేలానికి తీసుకొని వచ్చారు. అందులో 531 బేళ్లు కొనుగోలుయ్యాయి. వివిధ కారణాలతో 194 బేళ్లను తిరస్కరించారు. గరిష్ట ధర కేజీ రూ 280, కనిష్ట ధర కేజీ రూ.209 సరాసరి ధర కేజీ రూ.239.39గా నమోదయింది.

శరవేగంగా బిఎం డ్రైన్‌పై అక్విడెక్టు నిర్మాణం



అక్విడెక్టు నిర్మాణానికి ఏర్పాటు చేస్తున్న పిల్లర్లు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గతేడాది అక్టోబర్ నెలలో కూలిపోయిన బిఎం డ్రైన్‌పై ఉన్న వెల్లటూరు ఛానల్ అక్విడెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. భట్టిప్రోలు, చెరుకుపల్లి, నగరం, నిజాంపట్నం మండలాల పరిధిలో 36వేల ఎకరాలకు ఈ ఛానల్ ద్వారా సాగునీరు అందాల్సి ఉంది. బ్రిటిష్ కాలంలో నిర్మించిన ఈ అక్విడెక్టు శిథిలావస్థకు చేరి కూలిపోయింది. దీంతో సంబంధిత అధికారులు తాత్కాలికంగా మరమత్తులు చేపట్టి పంటలు కాపాడగలిగారు. వేమూరు శాసన సభ్యులు నక్కా ఆనందబాబు, రేపల్లె శాసన సభ్యులు, మంత్రి అనగాని సత్యప్రసాద్ చొరవతో దీని నిర్మాణానికి ప్రభుత్వం నుండి రు.10.60 కోట్ల నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులతో గత నెల 23న పనులు ప్రారంభించారు. శరవేగంగా పనులు జరుపుతున్నారు. ఈ నిధులతో బిఎం డ్రైన్ నుండి మురుగు నీరు పారుదల కావటానికి అవసరమైన ఏడు కానాలు నిర్మిస్తున్నారు. దీని పిల్లర్లపై సాగునీరు పారే విధంగా స్లాబు ఏర్పాటు చేసి తద్వారా సాగునీటిని నడిపిస్తారు. అదే రీతిలో గతంలో ఉన్న పాత వంతెనపై రైతులు నడిచే విధంగా కాలిబాట ఉండేది. కొండ రాయితో నిర్మించిన ఆనాటి కట్టడానికి అనుగుణంగా కాలిబాట కొనసాగింది. కాలిబాట ద్వారా భట్టిప్రోలు నుండి చిన్నపులివర్రు వరకు రాకపోకల కొనసాగించేవారు.

కాలిబాటకు స్థానంలో వంతెన నిర్మాణం

గతంలో అక్విడెక్టుపైగా ఏర్పాటు చేసిన కాలిబాట స్థానంలో ప్రస్తుతం బిఎం డ్రెయిన్‌పై రైల్వే గేటు నుండి వెల్లటూరు వరకు కాలువ కట్టపై వాహనాలు నడిచే విధంగా అవసరమైన వంతెన ఏర్పాటు చేయనున్నారు. ఈ వంతెన నిర్మాణంతో భట్టిప్రోలు నుండి వేల్లెటూరు మార్గంలో పంట పొలాల రైతులు వెల్లటూరు ఛానల్ కట్ట ద్వారా పంట ఉత్పత్తులను తరలించుకునేందుకు ఎంతో దోహదపడుతుంది. ఇదే సమీపంలో వెల్లటూరు ఛానల్‌కు కాలిబాట వంతెన ఏర్పాటు చేయనున్నారు. దీనివలన కాలువకు ఇరువైపులా పంట పొలాల రైతుల అవసరాలకు అనుగుణంగా రాకపోకలు సాగించేందుకు వీలు కలుగుతుంది. రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం ఇలాంటి కట్టడాల నిర్మాణానికి అవసరమైన నిధులను మంజూరు చేసిందని రైతులు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ నాటికి అక్విడెక్టు నిర్మాణం పూర్తి చేసి వెల్లటూరు ఛానల్ ద్వారా సాగునీటిని కొనసాగించే విధంగా చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ ఏఈ సువర్చల తెలిపారు.



మురుగు పారుదలకు ఏర్పాటు చేస్తున్న కానాలు

సైనికులకు సంఘీభావంగా ర్యాలీ



పర్చూరులో సైనిక సంఘీభావ ర్యాలీ దృశ్యం



సంతమాగులూరులో సింధూర్ విజయోత్సవ ర్యాలీ

ప్రజాశక్తి - పర్చూరు

భారత సైనికులకు సంఘీభావం తెలుపుతూ శనివారం భారీ ర్యాలీ నిర్వహించారు. స్థానిక బొమ్మలు సెంటర్ నుండి చీరాల రోడ్డు, టిడిపి కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అబ్దుల్ హఫీజ్, ఎంపిడిఒ వి ప్రద్యుమ్న కుమార్, ఈఒపీఆర్డి కె సత్యనారాయణ, ఎస్‌హెచ్‌జి సభ్యులు, టిడిపి నాయకులు షేక్ షంశుద్దీన్, మామిడిపాక హరి ప్రసాద్, బిజెపి నాయకులు అడపాల కృష్ణ, జనసేన నాయకులు పాల్గొన్నారు.

చెరుకుపల్లి : దేశం కోసం ప్రాణాలకు తెగించే సైనికుల సేవలు వెలకట్టలేనివని తెలుగుదేశం నాయకులు, కూచిపూడి నీటి సంఘాల అధ్యక్షులు ఎంఆర్‌కె మూర్తి అన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నుండి చెరుకుపల్లి ప్రధాన రహదారుల్లో ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలి నిర్వహించారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణ ఆంధ్ర నినాదాలు చేశారు. సర్పంచ్ దేవరకొండ వాణి, కార్యదర్శి విజయబాబు పాల్గొన్నారు.

సంతమాగులూరు : స్వచ్ఛ ఆంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారత సైన్యం చేపట్టిన ఆపరేషన్ సింధూర్ విజయోత్సవ ర్యాలీ, మానవహారం శనివారం నిర్వహించారు. ఎంపిడిఒ జ్యోతిర్మయి, తహశీల్దారు కె రవిబాబు, ఈఒపిఆర్డి రాంప్రసాద్ పాల్గొన్నారు.

యద్దనపూడి : మండల కేంద్రమైన యద్దనపూడిలో సింధూరు ర్యాలీ కూటమి నాయకులు, పోలీసు సిబ్బంది శనివారం నిర్వహించారు. కూటమి నాయకులు రంగయ్యచౌదరి, కె నాగేశ్వరరావు, సుబ్బారావు, శ్రీను, వెంకట్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



చెరుకుపల్లిలో విజయోత్సవ ర్యాలీలో అధికారులు



యద్దనపూడిలో తిరంగా ర్యాలి నిర్వహిస్తున్న దృశ్యం

వీధి నాటకాల ద్వారా ఎయిడ్స్‌పై అవగాహన

ప్రజాశక్తి- మార్కాపురం రూరల్

రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆదేశాల మేరకు కళాజాత బృందాలను జిల్లాలో ప్రారంభించారు. స్థానిక హాండ్స్ ఆఫ్ కంఫాషన్ సొసైటీ (పియు) ఆధ్వర్యంలో ప్రసాద్‌బాబు కళాజాత బృందంచే స్థానిక గడియార స్తంభం సెంటర్‌లో శనివారం వీధి నాటకం ప్రదర్శించి ఎయిడ్స్ వ్యాధిపై అవగాహన కల్పించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్ రాకుండా తీసుకోవాల్సిన జాగ్రతలు, వ్యాధిగ్రస్తుల పట్ల వివక్షత, చిన్న చూపు లేకుండా ఎలాగా సమాజంలో కలిసి జీవించాలనే విషయాలను వివరించారు. హెచ్‌ఐవి, ఎయిడ్స్, క్షయ వ్యాధి సంబంధం గురించి, హెచ్‌ఐవి ఉన్న గర్భిణి నుంచి బిడ్డకు రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సుఖవ్యాధులు, చికిత్స, కండోమ్ ఉపయోగం తెలిపారు. ఈ సందర్భంగా హెచ్‌ఐవి పరీక్ష అన్ని ప్రభుత్వ వైద్యశాలలో ఉచితంగా చేస్తారని, వ్యాధి ఉన్న వారు ఏఆర్‌టి కేంద్రాల ద్వారా ఇచ్చే మందులు క్రమం తప్పకుండా వాడినట్లయితే జీవిత కాలాన్ని పెంచుకోవచ్చని అన్నారు. క్రమం తప్పకుండా సిడి-4, వైరల్ లోడ్ పరీక్షలు చేయించుకోవాలని అన్నారు. కార్యక్రమంలో స్థానిక హాండ్స్ ఆఫ్ కంపాషన్ ప్రివెన్షన్ యూనిట్ ఎన్జీఓ ప్రాజెక్ట్ డైరెక్టర్ టి ఆనంద్ బెంజిమెన్, ప్రకాశం జిల్లా సిపిఎం పి కిరణ్, డిఎస్‌ఆర్‌సి వెంకట్, స్టాఫ్ పిఎంకె విజయకుమారి, సిబిఓ ప్రెసిడెంట్ అలియా భాను, ఏఎన్‌ఎం విజయకుమారి, షబానా, రేణుక, కళాజాత బృందం పాల్గొన్నారు.



పూజలు చేస్తున్న మంత్రి డాక్టర్ స్వామి

వేణుగోపాలస్వామి ఆలయంలో మంత్రి స్వామి పూజలు

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండలోని జాలమ్మ తల్లి వేణుగోపాలస్వామి దేవస్థానంలో శనివారం రాత్రి రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయ, వాలంటీర్ల శాఖ మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం వార్షికోత్సవ సందర్భంగా నిర్వాహకులు దాసరి యానాదిరావు పిలుపుమేరకు ఆయన అక్కడకు వచ్చారు. రెండు దేవస్థానాలు సందర్శించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు ఆశీర్వదించారు. తీర్ధ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట టిడిపి నాయకులు వేల్పుల సింగయ్య, మించల బ్రహ్మయ్య, పామర్తి మాధవరావు, తదితరులు పాల్గొన్నారు.



ముక్కోన్న పార్క్ సెంటర్లో జలమయమైన రహదారి

చీరాలలో కుంభ వర్షం

ప్రజాశక్తి - చీరాల

చీరాలలో వర్షం దంచి కొట్టింది. శనివారం రాత్రి ఉరుములు, మెరుపులతో ఒక్కసారిగా కుంభ వర్షం పడింది. దీంతో రోడ్లన్నీ జలమయం అయ్యాయి. పలుచోట్ల ఉరుముల దాటింది విద్యుత్ అంతరాయం ఏర్పడి. పట్టణమంతా అంధకారంగా మారింది. దీంతో వాహనదారులు, బాటసారులు ఉరుముల దాటికి తట్టుకోలేక భద్రతా ప్రదేశాల్లోకి పరుగులు తీశారు. ఒక్కసారిగా మారిన వాతావరణంతో ప్రజలు భయబ్రాంతులు అయ్యారు. బహిరంగ ప్రదేశాల నుండి పరుగులు తీశారు. పలువురు ద్విచక్ర వాహనదారులు వర్షం దాటికీ వాహనాలు స్టార్ట్ కాకపోవడంతో తోసుకుంటూ వెళ్లాల్సిన పరిస్థితి కనిపించింది.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అద్దంకి జార్లపాలెంలో ర్యాలీలో డిప్యూటీ సీఈఓ బాలమ్మ



పర్చూరులో స్వచ్ఛ దివస్ ర్యాలి నిర్వహిస్తున్న సిబ్బంది

ప్రజాశక్తి - అద్దంకి

స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రలో భాగంగా ప్రతి నెల మూడో శనివారం పరిశుభ్రత కార్యక్రమం చేపడుతున్నట్లు డిప్యూటీ సీఈఓ బాలమ్మ పేర్కొన్నారు. మండలంలోని జార్లపాలెం గ్రామాన్ని ఆమె సందర్శించారు. ఈ నెలలో 'బీట్ టు హీట్' నినాదంతో చెట్లు నాటడం, చలివేంద్రాలు ఏర్పాటు చేయడం ద్వారా వేసవి తాపాన్ని ఎదుర్కొనవచ్చని అన్నారు. ఉపాధి హామీ పథకంలో నీటి కుంటలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కుంటలకు నీరు నింపి పశు పక్షాదులకు పొలాల్లో నీరు ఉండే విధంగా ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ సిగ్నల్స్ దగ్గర గ్రీన్ మ్యాట్ ఏర్పాటు చేయడం, ఆపరేషన్ సింధూరం విజయ వంతమైన సందర్భంగా తిరంగా ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ సింగయ్య, డిప్యూటీ ఎంపిడిఒ ఆర్‌విఎస్‌హెచ్‌విఎం ప్రసాద్, పంచాయతీ సెక్రటరీ బి మల్లికార్జునరావు, సర్పంచి సుశీల, ఎంపీటీసీ ఎం కోటేశ్వరమ్మ, ధూళిపాల వీరాస్వామి, భార్గవ్, సుబ్రహ్మణ్యం, మాధవరావు పాల్గొన్నారు.

పర్చూరు : పాకిస్తాన్ టెర్రరిస్టులను దీటుగా ఎదుర్కొని మట్టుపెట్టిన భారత సైనికులకు సంఘీభావంగా స్థానిక తహశీల్దారు కార్యాలయం సిబ్బంది జాతీయ జెండా చేతబూని శనివారం ర్యాలీ నిర్వహించారు. ఆపరేషన్ సింధుర్ విజయవంతం పట్ల హర్షం వ్యక్తం చేశారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌లో భాగంగా తహశీల్దారు కార్యాలయం ఆవరణలో పరిశుభ్రతా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రతిజ్ఞ చేశారు. పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ప్లాస్టిక్ వస్తువులను వాడకూడదని తెలిపారు. కార్యక్రమాల్లో ఎలక్షన్ డిటీ ఆర్ఎం మాధవి, రీ సర్వే డిటి అరుణ, మండల సర్వేయర్ ఐ బాల ఆంజనేయులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : స్వర్ణాంధ్ర, స్వచ్ఛంధ్రలో భాగంగా స్థానిక ఎంపిడిఒ కార్యాలయం వద్ద ఎండ తీవ్రత తగ్గించుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలపై శనివారం అవగాహన కల్పించారు. వేసవిలో చలివేంద్రాల ఏర్పాటు, ఆఫీసు, ఇంటి పైకప్పులపై కూలింగ్ పెయింట్ వేయించు కొనుట, చెట్లు నాటడం, బస్టాండ్ల వద్ద, పార్కింగ్ ప్రదేశాల్లో షేడ్ నెట్స్ ఏర్పాటు చేయడం గురించి అధికారులు, ప్రజ లకు వివరించారు. స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞతో మానవహారం నిర్వహించారు. దీనితో పాటు ఉగ్రవాదంపై పోరులో మన సైనికులు చూపించిన ధైర్య సాహసాలను కీర్తిస్తూ ఆపరేషన్ సింధూర్ తిరంగా యాత్ర, జాతీయ జెండాలతో ర్యాలీ నిర్వహించారు. అమరుడైన సైనికుడు మురళి నాయక్‌కు నివాళి అర్పించారు. మండల ప్రత్యేక అధికారి బి వేణుగోపాల్, జడ్పిటిసి టి ఉదయ భాస్కరి, ఎంపిడిఒ ఎస్ వెంకటరమణ, డిప్యూటీ ఎంపిడిఒ టి ఊహారాణి, ఎపిఎం శ్రీమన్నారాయణ, ఎపిఒ శివపార్వతి, ఆర్ఐ పని కుమార్, హౌసింగ్ ఎఇ రేవతి సౌమ్య పాల్గొన్నారు.

యద్దనపూడి : స్వచ్ఛంధ్ర, స్వర్ణంధ్రలో భాగంగా శనివారం ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో తహశీల్దారు రవి కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం వీస్తున్న విపరీతమైన వడగాలులకు మనమే కారణమని అన్నారు. ఇష్టారీతిన చెట్లు నరకడం వల్ల ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు. ప్రత్యేక అధికారి ప్రకాష్ మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి పచ్చదానాన్ని పెంచాలని అన్నారు. 'బీట్ ద హీట్' థీమ్ క్రింద అధికంగా ఉన్న ఉష్ణోగ్రతలను తగ్గించేందుకు తీసుకోవలసిన చర్యలు వివరించారు. ఆపరేషన్ సిందూర్ ర్యాలీ నిర్వహించి పహల్గాం దాడిలో చనిపోయిన దేశ పౌరులు, వీర మరణం పొందిన సైనికులకు అంజలి ఘటించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ పిటివి కృష్ణ, డాక్టర్ శ్రీహర్ష, పంచాయతీ కార్యదర్శి శ్రీను, కిషోర్ పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని కారంచేడు, స్వర్ణ గ్రామాల్లో ఆపరేషన్ సింధూరం విజయవంతంపై అధికారులు, నాయకులు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దారు నాగరాజు, ఎంపిడిఒ నేతాజీ మాట్లాడుతూ ఉగ్రవాదం నిర్మూలించడానికి భారత ప్రభుత్వం చేస్తున్న కృషిని కొనియాడారు. సైనికులను అభినందించారు. స్వర్ణ గ్రామంలో స్వచ్ఛంద్రా స్వర్ణంద్రాలో భాగంగా మూడు మజ్జిగ చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం వీస్తున్న విపరీతమైన వడగాలులకు చెట్లు నరకడమే కారణమని అన్నారు. గ్రామాల్లో ప్రతి ఒక్కరు మొక్కలు పెంచి పచ్చదానాన్ని కాపాడాలని అన్నారు. అధికంగా ఉన్న ఉష్ణోగ్రతలను తగ్గించడానికి మొక్కలు పెంచాలని చెప్పారు. ఆపరేషన్ సిందూర్ ర్యాలీ నిర్వహించి వీర జవానులకు అంజలి ఘటించి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో కారంచేడు, స్వర్ణ సర్పంచులు మధుబాబు, శివపార్వతి, కార్యదర్శులు చక్రవర్తి, టిడిపి నాయకులు తిరుమలశెట్టి శ్రీహరి పాల్గొన్నారు.



భట్టిప్రోలులో తిరంగా ర్యాలీ దృశ్యం



మాట్లాడుతున్న యద్దనపూడి తహశీల్దారు రవికుమార్



మాట్లాడుతున్న కారంచేడు తహశీల్దారు నాగరాజు

గంగవరం మలుపు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

- కుంగిన రోడ్డు మార్జిన్
- ప్రమాదకరంగా ఉన్న గంగవరం మలుపు
- పట్టించుకోని అధికార్లు

ప్రజాశక్తి - ఇంకొల్లు

ఇంకొల్లు నుంచి గంగవరం వెళ్లే ఆర్ అండ్ బి రోడ్డులో దగ్గుబాటి విద్యా సంస్థలు దాటిన తరువాత రోడ్డు మలుపు వద్ద రోడ్డు మార్జిన్ రెండు ప్రాంతాల్లో బాగా కృంగిపోయింది. రోడ్డు ఇరుకుగా ఉండటంతో పాటు మలుపు ఉండటం వలన ప్రమాదం పొంచి ఉందని వాహనదారులు, పాదచర్లు వాపోతున్నారు. ఇటీవల ఆర్ అండ్ బి నిధులతో రోడ్డు మరమ్మత్తులు చేపట్టినప్పటికీ సంబంధిత కాంట్రాక్టరు కానీ, ఆర్ అండ్ బి అధికారులు కానీ ప్రమాదకరమైన ఈ మార్జిన్‌ను మరమ్మత్తులు చేయలేదు. గతేడాది వర్షాల సమయంలో కుంగిపోయిన ప్రాంతంలో రోడ్డు వర్షాలకు చీలి కుంగిపోయింది. ఈ విషయం ఆర్ అండ్ బి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. స్థానిక పోలీసులు దెబ్బతిన్న ప్రాంతంలో భద్రత బోర్డులు ఏర్పాటు చేశారు. అప్పట్లో కుంగి దెబ్బతిన్న రోడ్డును జెసిబి ద్వారా కదిలించి, అక్కడే రోడ్డు మార్జిన్ మట్టిని తాత్కాలికంగా వేశారు. ఆ సమయంలో ఇంకొల్లు నుంచి గంగవరం వరకు రోడ్డు గోతులమయమై దెబ్బతినింది. అనంతరం ఆర్ అండ్ బి శాఖ గంగవరం ఇంకొల్లు రోడ్డు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేసింది. ఆ నిధులతో రోడ్డు మరమ్మతులు చేసినప్పటికీ రోడ్డు మార్జిన్ దెబ్బతిన్న ప్రాంతంలో ఎలాంటి మరమ్మతులు నేటి వరకు చేపట్టలేదు. ప్రమాదం పొంచి ఉన్న మలుపు వద్ద మరమ్మతులు చేపట్టకపోవడంతో మళ్లీ ఆ ప్రాంతంలో రెండు చోట్ల మార్జిన్, మీటర్ లోతు వరకు మట్టి కుంగిపోయి ఉంది. అధికారులు, కాంట్రాక్టు దారులు మరమ్మత్తుల సమయంలో ఈ మార్జిన్‌ను మరమ్మత్తులు చేయకుండా గాలికి వదిలేశారని స్థానిక ప్రజలు, వాహనదారులు ముక్కున వేలేసుకుంటున్నారు. ఇప్పటికైన ఆర్ అండ్ బి అధికారులు స్పందించి ప్రమాదకరమైన ఆ మలుపును పటిష్టం చేయాలని కోరుతున్నారు.



రోడ్డు మార్జిన్ కృంగిపోయి ప్రమాదకరంగా ఉన్న దృశ్యం



గ్రంథాలయ స్థలం పత్రం అందిస్తున్న తహశీల్దారు

గ్రంథాలయ స్థలం సమస్య పరిష్కారం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణంలో దశాబ్దాల నుండి గ్రంథాలయం ఉంది. ఇప్పటివరకు సొంత భవనం లేక అద్దె భవనంలోనే కొనసాగింది. ఎట్టకేలకు తహశీల్దారు జి చరణ్ చేతుల మీదుగా ఎన్ఎస్‌పి కార్యాలయ ప్రాంగణం నందు 10 సెంట్లు స్థలం గ్రంథాలయ భవనంకు అప్పగిస్తూ స్థలం పత్రాలను రిటైర్డ్ గ్రంథ పాలకుడు సుగుణరావు, ప్రస్తుతం రికార్డ్ అసిస్టెంట్ సిహెచ్‌విఎల్ వసుంధర దేవి, పట్టణ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మన్నం త్రిమూర్తులు సమక్షంలో పత్రాలు శనివారం అందించారు. మంత్రి గొట్టిపాటి రవికుమార్ కృషి ఉన్నదని త్రిమూర్తులు అన్నారు. విశ్రాంత గ్రంథపాలకుడు సుగుణరావు మాట్లాడుతూ ఇప్పటికీ పరిష్కారమైన గ్రంథాలయ భవన సంస్థ నిర్మాణంనకు 10 సెంట్లు స్థలం కేటాయించినందుకు పట్టణ ప్రజలకు, సహకరించిన మంత్రి రవికుమార్, తహశీల్దారుకు అభినందనలు తెలిపారు.



వీల్‌చైర్స్ అందిస్తున్న రోటరీ క్లబ్ ప్రతినిధులు

వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి - చీరాల

సేవా కార్యక్రమాల్లో రోటరీ క్లబ్ అన్నివేళలా ముందుంటుందని రోటరీ ప్రతినిధులు తెలిపారు. స్థానిక రోటరీ కమ్యూనిటీ హాలులో రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పిడుగురాళ్ళ లైమ్ సిటీ, జుబ్లిహిల్స్ రోటరీ క్లబ్ సంయుక్త సహకారంతో 15ఏళ్లలోపు దివ్యాంగ విద్యార్థులకు వీల్‌చైర్స్ శనివారం అందజేశారు. ఈ సందర్భంగా నడుం కింద భాగం నుండి నరాల బలహీనత వుండి కూర్చొనలేని, నిలబడలేని దివ్యాంగులకు 4 వీల్‌చైర్స్ అందజేశారు. కార్యక్రమంలో చందలూరి బాల వెంకటేశ్వరరావు, నక్కల సురేష్ బాబు, పోలుదాసు రామకృష్ణ, మామిడాల శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, జివై ప్రసాద్, బి హేమంత్ కుమార్, జాగర్లమూడి సురేష్, డాక్టర్ ఐ బాబూరావు, టిఎల్ ప్రతాప్, బండారుపల్లి హేమంత్ కుమార్ పాల్గొన్నారు.



నిందితుడి వివరాలు చెబుతున్న పోలీసులు

చోరీ కేసులో నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - బాపట్ల

ఇళ్లలో దొంగతనాలకు పాల్పడే నిందితుడిని వెదుళ్ళపల్లి పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. ఎస్ఐ భాగ్యరాజ్ తెలిపిన వివరాలు ప్రకారం ఏడాది క్రితం స్టువర్టుపురంలో పెద్ద గ్యాంగ్‌కు చెందిన దేవర కిరణ్మయి ఇంట్లో దొంగతనానికి పాల్పడి బంగారు నాన్తాడు దొంగిలించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదైందని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు తెలిపారు. స్టువర్టుపురంకు చెందిన ఐదుగురు వ్యక్తులు కలిసి కిరణ్మయి ఇంట్లో లేని సమయంలో పెద్ద గ్యాంగుకు చెందిన దేవర ప్రవీణ్ ఇంట్లోకి ప్రవేశించి నాన్తాడు దొంగిలించాడని విచారణలో తేలినట్లు తెలిపారు. వారిలో ఇద్దరు నాటు సారాయి కేసులో జైలులో ఉన్న వారికి బెయిల్ వేయడానికి ఖర్చుల నిమిత్తం దొంగిలించిన నాన్తాడు తాకట్టు పెట్టడానికి వెళ్లే క్రమంలో అందులోని మూడవ ముద్దాయి స్టువర్టుపురం గ్రామం పెద్ద గ్యాంగుకు చెందిన మాదిగాని రామచంద్ర కుమార్ అలియాస్ ప్రేమ్ చంద్ అలియాస్ పెద్దపప్పుని శుక్రవారం రాత్రి అరెస్టు చేసి బంగారు నాన్తాడు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితుడిని కోర్టుకు హాజరు పరిచామని, మరో నలుగురు నిందితులు పరారీలో ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

ప్రజాశక్తి - పర్చూరు

మండల కేంద్రమైన పర్చూరులోని పిఆర్ గెస్ట్ హౌస్ ప్రక్కనే ఉన్న వర్షపు నీటితో నిండిన ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి దేహం పడి ఉంది. మృతదేహాన్ని శనివారం గుర్తించిన స్థానికులు ఎస్ఐ మాల్యాద్రికి సమాచారం అందించారు. పంచాయతీ సిబ్బంది, రెవెన్యూ అధికారులు నీటిలో పడి ఉన్న మృద్దేహాన్ని బయటికి తీసి ట్రాక్టర్‌లో పర్చూరు సిహెచ్‌సి మార్చురీకి తరలించారు. మృతుడు చొక్కా లేకుండా నల్లటి లాగు తొడుక్కొని ఉన్నాడని ఎస్ఐ తెలిపారు. 40 నుంచి 50ఏళ్లలోపు వయస్సు ఉంటుందని, ప్రమాదవశాత్తు నీటిలో పడి మృతిచెందాడా? లేక మరి ఏదైనా ఇతర కారణాలు ఉన్నాయా? అనేది తెలియాల్సి ఉందని తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి

మంత్రి స్వామి

ప్రజాశక్తి-జరుగుమల్లి

ప్రతి ఒక్కరూ ఒక మొక్క నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలని, చెట్లు, అడవులను సంరక్షించాలని మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి తెలిపారు. 'స్వచ్ఛ ఆంధ్ర.. స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా జరుగుమల్లిలో మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి చలివేంద్రం, మెడికల్ క్యాంపును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. మన చుట్టూ ఉన్న పరిసరాలను మనమే శుభ్రపరుచుకోవాలన్నారు. ప్రస్తుతం వేసవి దష్ట్యా ప్రజలు చల్లని నీరు, మజ్జిగ ఎక్కువగా తాగాలన్నారు. పొలాల్లో నీటి తొట్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం పశువులకూ నీరందిస్తోందన్నారు. స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు స్వచ్ఛందంగా చలివేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల దాహార్తి తీర్చేందుకు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో జరుగుమల్లి తహశీల్‌దార్ బి.జనార్ధన్, జరుగుమల్లి ఎంపిడిఓ ఎం.వి.రమణమూర్తి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్

వడదెబ్బకు గురికాకుండా తగిన జాగ్రత్తలు

చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వడదెబ్బ బారిన పడకుండా ప్రజలు ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా పిలుపునిచ్చారు. శనివారం కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన చలివేంద్రం, వైద్య శిబిరాన్ని సంయుక్త కలెక్టర్ ఆర్. గోపాలకష్ణ , డిఆర్ఓ బి.చిన ఓబులేసులతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎండలు పెరుగుతుండటంతో వడదెబ్బ బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రభుత్వం కూడా ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాదికారి డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, కలెక్టరేట్ లోని వివిధ సెక్షన్ల సూపరింటెంట్లు, ఉద్యోగులు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

ఆరోగ్యకరమైన వాతావరణమే లక్ష్యం

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

భావితరాల ఆరోగ్యకరమైన వాతావరణమే లక్ష్యంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా ఎస్పీ తుషార్ డూడి తెలిపారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు శనివారం జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ లు, కార్యాలయాలలో "స్వచ్ఛ ఆంధ్ర - స్వర్ణ ఆంధ్ర" కార్యక్రమం జిల్లా పోలీసులు నిర్వహించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు జిల్లా ఎస్పీ స్వయంగా పాల్గొని చెత్త, వ్యర్థాలను తొలగించి పరిసరాలు పరిశుభ్రం చేశారు. గుణపం, పారలు, చీపురులు చేతబట్టి పిచ్చి మొక్కలు తొలగించారు. చెట్లకు పాదులు తీసి నీరు పోశారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్, ఎఆర్ డిఎస్పీ పి.విజయసారది, ఎస్బి ఇన్స్పెక్టర్ నారాయణ, ఆర్.ఐ మౌలుద్దీన ఇతర పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం

- జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి
- వేమూరులో 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర'



మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

ప్రజాశక్తి-వేమూరు, బాపట్ల జిల్లా

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని రాష్ట్ర సమాచార శాఖ, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం వేమూరులో 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రతి నెలా మూడో శనివారం 'స్వర్ణ ఆంధ్ర.. స్వచ్ఛ ఆంధ్ర..' కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని మంత్రి పార్థసారథి అన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వేమూరులోని నందమూరి బసవ తారకరామా బస్ షెల్టర్‌లోని ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. బస్సు షెల్టర్ నుండి ఆపరేషన్ సింధూర్ తిరంగా యాత్ర ర్యాలీ ప్రారంభించారు. ఈ ర్యాలీ బస్సు షెల్టర్ నుండి రైల్వే గేట్ సెంటర్ వరకు జరిగింది. రైల్వే గేట్ సెంటర్లో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు. ఆ సెంటర్లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించారు. అక్కడ నుండి స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రోడ్డును పరిశుభ్రం చేశారు, రైతులకు వ్యవసాయ సాగు యంత్రాలను అందించారు. పర్యావరణ పరిరక్షణకు గానూ చెట్లను నాటారు. డ్వాక్రా మహిళలు, సచివాలయ సిబ్బంది మానవహారాన్ని ఏర్పాటు చేశారు. జిల్లా అధికారులు పట్టణ ప్రజలతో ఆయన స్వచ్ఛ ఆంధ్ర ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఎన్టీఆర్ కళావేదికలో ఏర్పాటుచేసిన బహిరంగ సభలో మాట్లాడారు. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛంద కార్యక్రమాన్ని చాలా బాధ్యతగా నిర్వహిస్తున్నారని అన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా లేకపోవడం వలన అనేక రోగాలకు గురై వైద్యం కోసం ఆసుపత్రుల చుట్టూ తిరుగుతున్నారని చెప్పారు.

కలెక్టర్ జె. వెంకట మురళి మాట్లాడుతూ మన ఇంటి, వీధి, గ్రామ, పట్టణ, వార్డు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ప్రతి ఒక్కరూ వారి ఇంట్లోని చెత్తను తడి చెత్త, పొడి చెత్త, ప్రమాదకరమైన వస్తువులు అనే మూడు రకాలుగా విభజించాలని అన్నారు. వీటి కోసం ప్రభుత్వం మూడు రంగులలో బుట్టలను ఉచితంగా అందజేస్తుందని చెప్పారు. మనం పరిశుభ్రమైన, ఆహ్లాద కరమైన వాతావరణంలో మన ప్రాంతాన్ని తీర్చిదిద్దుకునే అవసరం ఎంతైనా ఉందని ఆయన అన్నారు.

వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు మాట్లా డుతూ ప్రశాంతమైన, ఆహ్లాదకరమైన వాతావరణంలో మన భావితరాలు ఎదగాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో బావుడా ఛైర్మన్ సలగల రాజశేఖర్ బాబు, జిల్లా అధికారులు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

రక్తపోటుపై అవగాహన అవసరం

డిఎంహెచ్ఓ డాక్టర్ టి.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రక్తపోటు బారిన పడుతున్న వారి సంఖ్య నానాటికీ పెరుగుతోందని, ఈ వ్యాధిపై ప్రజలలో అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ టి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. ప్రపంచ రక్తపోటు దినోత్సవం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ర్యాలీని డిఎం,హెచ్ఓ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి మాట్లాడుతూ రక్తపోటు (బిపి) బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతుందని, చాలా మందికి వ్యాధి ఉందన్న విషయం తెలుసుకునే లోపు అనర్థాలతో శరీరంలోని పలు అవయవాలు దెబ్బతింటున్నాయన్నారు. 120/80 ఉంటే సాధారణ బిపిగా లెక్కిస్తారని, ఇటీవల చిన్న వయస్సులోనే దీని బారిన పడుతున్నవారి సంఖ్య ప్రపంచ వ్యాప్తంగా పెరుగుతోందన్నారు. ప్రజలకు అవగాహన కలిగించానికి ఎన్‌సిడి కార్యక్రమంలో ప్రతిరోజు గృహ సందర్శనలు చేసి 18 సంవత్సరముల పై బడినవారికి రక్తపోటు ఉంటే ప్రాథమిక చికిత్స అందించాలన్నారు. ప్రతి గ్రామంలో 104 వాహనం ద్వారా అందించే సేవలను ప్రజలందరు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అధిక రక్తపోటు ఉన్న వారి కోసం ఇటీవల ఒంగోలు సర్వజన ఆసుపత్రిలో గుండె జబ్బుల విభాగం ఏర్పాటు చేశారన్నారు. ఇక్కడ గుండె సంబంధిత వ్యాధుల నుండి రక్షణ పొందాలని కోరారు. బిపి ఉన్న వారు వ్యాధిపై అవగాహన కలిగి జాగ్రత్తలు పాటిస్తే వ్యాధి దరి చేరదన్నారు. బిపి ఉన్న ప్రతి ఒక్కరు ముందస్తుగా కిడ్నీ స్క్రీనింగ్ పరీక్షలు చేయించుకుని, వైద్యుల సలహాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఎన్‌సిడి నోడల్ అధికారి భగీరధి, అకౌంటెంట్ రాజేష్, మాస్ మీడియా అధికారి డి.శ్రీనివాసులు పాల్గొన్నారు.



ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఓ వెంకటేశ్వర్లు

'దద్దాల'ను ఎమ్మెల్యేగా గెలిపించాలి: బూచేపల్లి

ప్రజాశక్తి-పిసిపల్లి

దద్దాల నారాయణ యాదవ్‌ను కనిగిరి ఎమ్మెల్యేగా 2029లో గెలిపించాలని వైసీపీ జిల్లా అధ్యక్షులు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి అన్నారు. శుక్రవారం రాత్రి పాలేటి గంగమ్మ గుడి వద్ద వైసీపీ నాయకులు ఏర్పాటుచేసిన విద్యుత్తు ప్రభ వద్దకు ముఖ్యఅతిథిగా మాట్లాడారు. 11 నెలల కాలంలో ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందన్నారు. వైసీపీ వారు ప్రభలను ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. కార్యకర్తలు, అభిమానులు అందరూ కలిసికట్టుగా ఉండాలని, భవిష్యత్తులో ఎన్నికల సందర్భంగా అందరూ ఐక్యంగా కలిసి పనిచేయాలని కోరారు. వీరి వెంట జడ్పీ ఛైర్మన్ బూచేపల్లి వెంకాయమ్మ, ఎర్రగొండపాలెం ఎమ్మెల్యే టి.చంద్రశేఖర్, ఒంగోలు ఇన్‌ఛార్జి చుండూరి రవి, రెడ్డి కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ చింతల చెరువు సత్యనారాయణరెడ్డి, విద్యుత్ ప్రభ నిర్వాహకులు పరిమి వెంకటేష్ చౌదరి, చెన్నుపాటి వెంకటరావు, రేగల బాలయ్య, గోగడ సురేష్, బొమ్ము దత్తాత్రేయ రెడ్డి, కనిగిరి నియోజకవర్గ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

మృత్యు'దారులు'



ప్రకాశం, బాపట్ల జిల్లాలో గడచిన వారం రోజుల్లో జరిగిన రోడ్డు ప్రమాదాలు ప్రజలను కలవరపాటుకు గురిచేస్తున్నాయి. ఇంటి నుంచి వెళ్లిన వారు తిరిగి క్షేమంగా వస్తారా.? అన్న భయంతో కుటుంబీకులుంటున్నారు. పర్చూరు మండల పరిధిలో తిమ్మరాజుపాలెం గ్రామ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు కూలీలు అక్కడికక్కడే మతి చెందారు. బతుకుదెరువు కోసం బొప్పాయి కోత కూలీలుగా పనికి వెళుతున్న ప్రకాశం జిల్లా యర్రగొండపాలెం మండలం గడ్డమీద పల్లి గ్రామానికి చెందిన నలుగురు కూలీలు మరణించాడు. పనుల కోసం కూలీలు వ్యాన్‌లో వెళుతూ లారీ ఢీ కొన్న ఘటనలో మృత్యువాతపడ్డారు. చీరాల, వేటపాలెం, చినగంజాంల వద్ద జాతీయ రహదారిపై జరిగిన వేరువేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మరణించారు. బాపట్ల, కర్లపాలెం మండలాల్లో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురు మరణించారు. కొల్లూరు వద్ద స్కూటీని ఢీ కొన్న ఘటనలో తల్లి మరణించగా కుమార్తె తీవ్రంగా గాయపడింది. ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో జరిగిన వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో గృహిణి, ఏఆర్ కానిస్టేబుల్, హోంగార్డు, మోటార్‌సైకిలిస్టు, ఒక రైతు మృత్యువాతపడ్డారు. ప్రతిరోజూ జరుగుతున్న రోడ్డుప్రమాదాల్లో మృతుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది.విద్యుత్ షాక్‌తో రెండు మరణాలు జరిగాయి. రహదారులు సరిగ్గా లేకపోవడం, నిర్లక్ష్యంగా వాహనాలు నడపడం,మద్యం సేవించి వాహనాలు నడపడం,ఇరుకు రోడ్లు కూడా ప్రమాదాలకు కారణాలుగా ఉన్నాయి. రెండు జిల్లాలలోనూ అత్యవసర వైద్యసేవల కోసం ట్రామా కేర్ సెంటర్లు లేకపోవడం, క్షతగాత్రులకు వైద్యసేవలు ఆలస్యంగా అందుతున్న కారణాలతో మృతుల సంఖ్య పెరుగుతోందనే విమర్శలున్నాయి.

ఒంగోలులో దారుణహత్యకు గురైన టీడీపీ నేత, మాజీ ఎంపీపీ ముప్పవరపు వీరయ్య చౌదరి హత్యకేసులో 9 మంది నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. మరో ముగ్గురు నిందితులు పరారీ లో ఉన్నట్లు జిల్లా ఎస్పి చెప్పారు. వీరయ్య చౌదరి కుటుంబ సభ్యులను విద్య, ఐటి శాఖల మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలులోని వీరయ్య చౌదరి నివాసానికి వెళ్లిన మంత్రి లోకేష్ వీరయ్య చౌదరి సతీమణి, కుమారుడు, ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

వేసవిలో రెండు జిల్లాలోని పలు గ్రామాల ప్రజలు తాగునీటి కోసం ఖాళీ బిందెలతో నిరసన తెలుపుతున్నారు. ప్రకాశం జిల్లా లోని పశ్చిమ ప్రాంతంలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద అధికారులను నీటి కోసం నిలదీస్తున్నారు, బాపట్ల జిల్లాలోని రేపల్లే, బాపట్లతో పాటు, సముద్రతీర ప్రాంత గ్రామాల ప్రజలు, జగనన్న కాలనీ వాసులు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో గిట్టుబాటు ధరలు లేక కష్టాల్లో ఉన్న పొగాకు రైతుల్ని బయ్యర్లు ఆదుకోవాల్సి ఉంది. గత రెండు, మూడు సంవత్సరాలుగా పొగాకు కొనుగోలు చేసిన బయ్యర్లు, కంపెనీలు లాభ పడ్డారు. రైతులకు కూడా పొగాకు పంటకు గిట్టుబాటు ధర లభించింది. బ్రెజిల్, జింబాబ్వే వంటి దేశాల్లో పొగాకు అధిక దిగుబడి రావడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో పొగాకుకు కొంత మేర డిమాండ్ తగ్గిందని చెబుతున్నారు. దీంతో పొగాకు కొనుగోళ్లు తగ్గడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. బయ్యర్లు పొగాకు గ్రేడ్-1 కొనుగోళ్లు చేస్తున్నారు గానీ గ్రేడ్ 2, 3 రకాలను కొనుగోలు చెయ్యడం లేదు. అధిక ఉత్పత్తి పేరుతో పొగాకు ధరల్ని తగ్గించడం చేస్తున్నారు. పొగాకు రైతులను ఆదుకునేందుకు ప్రతి కంపెనీ విధిగా వేలంలో పాల్గొని అన్ని రకాల పొగాకును దామాషా ప్రకారం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాల్సి ఉంది. బర్లీ పొగాకును కంపెనీల వారు కొనడం లేదు. మంత్రులు, ఉన్నతాధికారులు చెప్పినా ఎవరూ కొంటున్న పరిస్థితి లేదు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో రైతులు ఇళ్ల వద్ద, పొలాల్లో బర్లీ పొగాకు నిల్వలు అలానే ఉన్నాయి. వర్షాల కారణంగా రైతులు మరింతగా నష్టపోతున్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై వైసీపీ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 117 వివాదాస్పదంగా మారడంతో.. ప్రత్యామ్నాయంగా కూటమి ప్రభుత్వం కొత్త జీవోలను తెచ్చింది. గత ప్రభుత్వం జీవో 117తో ఆరు రకాల పాఠశాలలను అమల్లోకి తీసుకురాగా.. కొత్త విధానం తీసుకొస్తామన్న కూటమి ప్రభుత్వం తొలుత ఐదు రకాల పాఠశాలల విధానాన్ని ప్రతిపాదించి, ఇప్పుడు దానిని తొమ్మిది రకాలుగా మార్చింది. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఏ పాఠశాలకు ఎంత మంది టీచర్లు అవసరమవుతారనేది అంచనా వేయనున్నారు. పాఠశాలల పునర్వ్యవస్థీకరణకు అనుగుణంగా ఉపాధ్యాయుల బదిలీలు చేస్తారు. త్వరలోనే బదిలీల షెడ్యూలు కూడా విడుదల కానుందని చెబుతున్నారు. బాపట్ల జిల్లాలో 1,341 పాఠశాలలు ఉన్నాయి. పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా ఫౌండేషన్ పాఠశాలలు 116, బేసిక్ ప్రైమరీ పాఠశాలలు 759, మోడల్ ప్రైమరీ పాఠశాలలు 232, ప్రాథమిక ఉన్నత పాఠశాలలు 45, ఉన్నత పాఠశాలలు 189గా చేశారు. తొమ్మిది రకాల పాఠశాలలుగా విభజన చేయడం అంటే ప్రభుత్వ పాఠశాల వ్యవస్థను నిర్వీర్యం చేయడమేనని ఉపాధ్యాయ సంఘాలు తప్పుపడుతున్నాయి. ఈ విధాలనాలకు వ్యతిరేకంగా 21న డిఇవో కార్యాలయాల ముట్టడికి ఉపాధ్యాయ సంఘాలు పిలుపునిచ్చాయి.

- ప్రజాశక్తి, బాపట్ల జిల్లా